# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త






## ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుంది

- ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జనవరి 2 ప్రభాతవార్త : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. ఎన్ఎంయు వెంకటగిరి డిపో కమిటి ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా అధ్యక్షులు డివిఆర్.కుమార్, జిల్లా సెక్రటరీ బిఎస్ బాబు కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గజమల, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఉద్యోగుల సమస్యలపై డిపిటిఓ మెమొరాండం ఇచ్చారు. గత 3 నెలలుగా జిల్లావ్యాప్తంగా అనేక పోరాటాలు చేస్తున్నప్పటికీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారించకుండ కాలయాపన చేస్తూ ఉన్నారని తెలిపారు. గత ప్రభుత్వం రద్దు చేసిన 1/19 సర్క్యులర్‌ను మన ముఖ్యమంత్రి వర్యులు ఉద్యోగుల భద్రతకు యథావిధిగా అమలు చేయటకు మేనేజింగ్ డైరెక్టర్‌కి అధికారులకు అదేశాలు



ఎమ్మెల్యే రామకృష్ణను సత్కరిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఇచ్చి ఉన్న కానీ తిరుపతి డిపిటిఓ జిల్లా వ్యాప్తంగా అమలు చేయకుండా ఉద్యోగులను ఆక్రమముగా ఉద్యోగం నుండి తొలగిస్తాఉన్నారని కార్మికులు ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ కార్యక్రమం నందు తిరుపతి జిల్లా అధ్యక్షులు డివిఆర్ కుమార్, జిల్లా సెక్రటరీ బి ఎస్ బాబు, డిపో సెక్రటరీ కె.వి.రత్నం, నాయకులు గురవయ్య, రమేష్ బాబు, గౌస్ భాష, సుబ్రమణ్యం, శ్రీహరి, క్రిష్ణ, సురేంద్ర, నరసయ్య, కె.శ్రీనివాసులు గేరేజ్ నాయకులు లక్ష్మణరావు, ఎంఎ రాజా, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు

## నేడు శివయ్యకు ఆరుద్ర అభిషేకం

- ఉద్దిపిండి లింగానికి నేయ్యి అభిషేకం



శ్రీకాళహస్తి, జనవరి 2 ప్రభాతవార్త: దక్షిణ కైలాసంలో వెలసిన భోళాశంకరుడు ముక్కంటీశునికి శనివారం జన్మదిన సందర్భంగా ఆరుద్ర అభిషేకాలు నిర్వహించ బడుతుందని ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆలయంలో ఏర్పాట్లు చేపట్టుటకు ఇన్సెపెక్టర్లకు సూచించినట్లు తెలిపారు. అరుదైన ఈ అభిషేకాలకు సంబంధించి అభిషేకాల సమయాల్లో మార్పులు ఉంటాయని తెలిపారు. శివయ్య జన్మ నక్షత్రమైన ఆరుద్ర రోజు స్వామి వారికి వేడినీళ్ళతో అభిషేకిస్తారన్నారు. ఏడాదిలో ఒకే ఒక రోజు వేడినీళ్ళ అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. ఈ రోజు శివరాత్రికి ఉన్నంత ప్రాధాన్యత ఉందన్నారు. వేకువ జాము 3 గంటలకు పురవీధుల్లో జేగంట మోగుతుందన్నారు. 3.30గంటలకు మంగళవాయిద్యాలు 3.45 గంటలకు తిరుమంజనం 4గంటలకు గోపూజ, పళ్ళియార, తేవారం, 4.30గంటలకు ప్రథమ కాలాభిషేకం, (భక్తుల సేవల్లేవు) నిర్వహించబడుతుందన్నారు.

**ఉద్దిపిండి లింగానికి అభిషేకం:**

ఆరుద్ర సందర్భంగా వేకువ జామున నిర్వహించే ఉద్దిపిండి లింగానికి నేతి అభిషేకం మహాశివరాత్రి పర్వదినానికి ఉన్నంత ప్రాధాన్యత ఉంటుంది. ఉదయం 6గంటలకు నిర్వహించే అభిషేక దర్శనం శివరాత్రి పర్వదిన దర్శనంతో సమానంగా భావిస్తారు. ఉద్దిపిండితో శివలింగాన్ని తయారు చేసి దానికి నేతితో అభిషేకిస్తారు. ఈ దర్శనం కోసం స్థానికులు తహ తహ లాడతారు. ఈ ఏడాది శనివారం వచ్చింది కాబట్టి ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందని చెబుతారు. ఉదయం 7గంటలకు నటరాజస్వరూపమైన శివయ్యకు ప్రత్యేక అభిషేకాలు గ్రామోత్సవం ఉంటుందన్నారు. తరువాత పరివార దేవతలకు నైవేద్యం ఉంటుందన్నారు. ఉదయం 9గంటలకు గొబ్బెమ్మ గ్రామోత్సవం ఉంటుందన్నారు. ఉదయం 10గంటలకు ద్వితీయ కాలాభిషేకం ఇందులో ఉష్ణోదక అభిషేకం మ ధ్యాహ్నం 2గంటలకు ఉచ్చికాలాభిషేకం, సాయంత్రం 5గంటలకు ప్రదోష కాలాభిషేకం, రాత్రి 8గంటలకు ఆరికట్ల ఉత్సవం తరువాత దర్శనం ముగింపు.

## 59,701 పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ : కలెక్టర్



నూతన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్

గుడిపాల, జనవరి 2 ప్రభాత వార్త: జిల్లాలో మొదటి రోజే 59,701 పట్టాదారు పాసు పుస్తకాలను రైతులకు అందించినట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం గుడిపాల మండలం వసంతాపురం గ్రామంలో ఎపి రీసర్వే ప్రాజెక్టు కింద నిర్వహించిన పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో శుక్రవారం నుండి 9వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించి రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేయనున్నామని, పాసు పుస్తకాలు అనేది దశబ్దాలుగా కొనసాగుతున్న కార్యక్రమం అని, ఈ కార్యక్రమం నిర్వహించడానికి ప్రధాన కారణం భూ రికార్డుల వ్యవస్థలో తీసుకువచ్చిన సంస్కరణలేనన్నారు. సిఎం నారా చంద్రబాబునాయుడు వ్యక్తులు శాశ్వతం కాదు భూమి శాశ్వతం అనే ఆలోచనతో రైతుల మనశ్శాంతి కోసం పట్టాదారు పాసుపుస్తకాలకు మళ్ళీ అందిస్తున్నారన్నారు. ల్యాండ్ రికార్డ్స్ శాఖ తన పరిధిలో వుండటంతో భూమి సర్వే-రీసర్వే ప్రక్రియలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంను విస్తృతంగా ఉపయోగిస్తున్నామన్నారు. డ్రోన్లు, రోవర్స్ ద్వారా అత్యంత కచ్చితంగా భూహద్దులు నిర్ణయించి రెండు నుండి మూడు సెంటీమీటర్లలోపు కొలతలు నమోదు చేస్తున్నామన్నారు. జిల్లాలోని అన్ని మండలాలకు కలిపి రాజముద్రతో కూడిన 59,701 కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు వచ్చాయని, వీటిని 298 గ్రామాల్లో పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పట్టాదారు పాసు పుస్తకాల్లో వివరాలు తప్పుగా ముద్రించి వుంటే అలాంటి పుస్తకాలను రైతులకు పంపిణీ చేయరన్నారు. గుడిపాల మండలంలో 13 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి 4,734 పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేస్తామన్నారు. ఈ సందర్భంగా తహసిల్దారు శ్రీనివాసులు రైతులకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శిరీష, స్థానిక సర్పంచ్ రజనీకాంత్, మాజీ జడ్పీటిసీ బాలాజీనాయుడు, పెద్ద సంఖ్యలో రైతులు, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా అనుమతులు మంజూరు : కలెక్టర్



జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సహాక కమిటీ సమావేశం

చిత్తూరు, జనవరి 2 ప్రభాతవార్త: జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటుకు పారదర్శకంగా అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట లోని సమావేశభవనంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సహాక కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి అవకాశాలు పెంపులో భాగంగా పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు పరిశ్రమల శాఖ ద్వారా పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన నిమిత్తం వారికి అవసరమైన నైపుణ్యాల పెంపుకు చర్యలు చేపట్టడంలో భాగంగా జిల్లాలోని పరిశ్రమలకు అవసరమైన శిక్షణ కలిగిన సిబ్బంది నిమిత్తం సంబంధిత పరిశ్రమలతో సమన్వయం చేసుకుని డిఆర్‌డిఎ, పశుసంవర్ధకశాఖ, మెప్మా అధికారుల సమన్వయంతో మండల, డివిజన్ స్థాయిల్లో సమీక్షా సమావేశాలు నిర్వహించాలని జిల్లా పరిశ్రమల శాఖ జిఎంను ఆదేశించారు. అలాగే పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూకేటాయింపులు త్వరంతంగా మంజూరు చేయడం జరుగుతుందని, పిఎంఇజిపి దరఖాస్తులను సత్వరం పరిశీలించి రుణాలు మంజూరు చేయాలని అలాగే యూనిట్లు గ్రౌండ్ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే కుప్పం, పలమనేరు, వి.కోట తదితర మండలాల్లో పాడి పరిశ్రమ, గ్రానైట్ పరిశ్రమలపై ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలన్నారు. నగిరి ఫ్లవర్లూమ్స్ ఎక్కువగా వున్నాయని అక్కడ ప్రజలను అనుసరించి పరిశ్రమలు నెలకొల్పడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే జిల్లాలో నెలకు 150 పిఎంఇజిపి యూనిట్లు గ్రౌండింగ్ చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ జిఎం సూరిబాబును కలెక్టర్ ఆదేశించారు. అలాగే ప్రతి మండలానికి 5 పిఎంఇజిపి యూనిట్లు గ్రౌండింగ్ లక్ష్యాలను డిఆర్‌డిఎకు చెందిన ప్రతి ఎపిఎంకు కేటాయించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జిఎం సూరిబాబు, జెడ్ఎం సుబ్బారావు, ఎల్‌డిఎం హరీష్, ఎస్పీడిసిఎల్ ఎస్ఇ ఇస్మాయిల్, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గుణశేఖర్‌రెడ్డి, డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి, గ్రౌండ్ వాటర్ అధికారి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా ఫైర్ ఆఫీసర్ పెద్దిరెడ్డి, మార్కెటింగ్ శాఖ ఎడి పరమేశ్వరన్ తదితరులు పాల్గొన్నారు

రూ. 5కోట్ల వ్యయంతో శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో...

## ఆధునిక అకాడమీకి భూమిపూజ

- జాతీయ స్థాయి ప్రమాణాలతో తిరుపతిలో నిర్మాణం - క్రీడాకారుల కోసం వెయిట్ లిఫ్టింగ్ హాల్, రెసిడెన్షియల్ వసతి గృహం నిర్మాణం : చేసిన చైర్మన్ రవి నాయుడు



జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మించనున్న అకాడమీకి భూమి పూజ

తిరుపతి క్రీడ, జనవరి 2 ప్రభాతవార్త: తిరుపతిలోని శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మించనున్న అత్యాధునిక వెయిట్ లిఫ్టింగ్ హాల్, క్రీడాకారుల కోసం వసతి గృహం నిర్మాణానికి శుక్రవారం శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధిని ముఖ్య లక్ష్యంగా తీసుకొని ముందుకు సాగుతోందని తెలిపారు. ఆ దిశగా దేశంలో క్రీడా శిక్షణకు పేరుగాంచిన పటియాలా తరువాత, తిరుపతిలోనే అత్యాధునిక మౌలిక సదుపాయాలతో సుమారు రూ. 5 కోట్ల వ్యయంతో ఈ క్రీడా అకాడమీని నిర్మించనున్నట్లు వివరించారు. ఈ అకాడమీ క్రీడాకారులకు సమగ్ర శిక్షణ అందించే కేంద్రంగా రూపుదిద్దుకోనుందని పేర్కొన్నారు. ఈ అకాడమీలో మొత్తం 200 మంది క్రీడాకారులకు సౌకర్యవంతంగా వసతి కల్పించే రెసిడెన్షియల్ హాస్టల్‌ను ఏర్పాటు చేయడం, 80 మంది క్రీడాకారులకు అనుకూలంగా జాతీయ స్థాయి ప్రమాణాలతో వెయిట్ లిఫ్టింగ్ హాల్‌తో పాటు జిమ్నాస్టిక్స్ హాల్‌ను ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా 150 మంది క్రీడాకారులు ఒకేసారి సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించుకునే విధంగా విశాలమైన మీటింగ్ హాల్‌ను నిర్మించనున్నారు. అలాగే వెయిట్ లిఫ్టింగ్‌తో పాటు జూడో, లాన్ టెన్నిస్, బ్యాడ్మింటన్, చెస్ వంటి ఇండోర్ మరియు అవుట్‌డోర్ క్రీడలకు అవసరమైన సదుపాయాలు కల్పించడంతో పాటు, రెసిడెన్షియల్ ట్రైనింగ్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీని ద్వారా ఒకే ప్రాంగణంలో అన్నీ క్రీడలకు సంబందించి క్రీడా శిక్షణ అందుబాటులోకి రానుందని అన్నారు. అకాడమీ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి 2026 జూన్ నాటికి క్రీడాకారులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామని శాప్ చైర్మన్ శ్రీ అనిమిని రవి నాయుడు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోట వాసు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు, యువత, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సామాన్య భక్తులకే ముక్తిద్వార దర్శనం



తిరుమల, జనవరి 2ప్రభాతవార్తప్రతినిధి: ధనుర్మాసంలో పవిత్రమైన పదిరోజుల వైకుంఠద్వార దర్శనంలో నాల్గవరోజు శుక్రవారం నుండి వారంరోజులు సామాన్య భక్తులకే అవకాశం కల్పిస్తున్నారు. ఈ వైకుంఠ దర్శనాలకు ఎటువంటి టోకెన్, టిక్కెట్ లేకున్నా సర్వదర్శనంలో భక్తులను తిరుమలలోని ఆక్టోపస్ భవనం కూడలి నుండి గురువారం రాత్రి అనుమతించిన టిటిడి అధికారులు శుక్రవారం ఉదయం శిలాతోరణం వద్ద ఉన్న క్యూలైన్ల మీదుగా భక్తులను వైకుంఠమ్ 2లోనికి అనుమతిస్తున్నారు. తొలినుండి పటిష్టప్రణాళికలు రచించిన టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ గురువారం మధ్యాహ్నం నుండి క్యూలైన్లను పర్యవేక్షించారు. సాయంత్రం వరకు 47వేలమంది భక్తులు వైకుంఠద్వారంలో దర్శించుకున్నారు.

## రైతులందరికి సంక్షేమ ఫలాలు లభ్యం : ఎమ్మెల్యే





నారాయణవనం, జనవరి 2 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వంలోనే రాష్ట్రంలోని రైతులందరికి సంక్షేమ ఫలాలు అందుతుందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10గంటలకు స్థానిక తహశీల్దారు కార్యాలయం ఆవరణలో ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన రైతుల భూమి పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రైతులకు సకాలంలో అన్నదాత సుఖీభవ, సబ్సీడి ద్వారా ఎరువులు, విత్తనాలు, గిట్టుబాటు ధరలు అందించడం, ప్రస్తుతం రైతులకు సంబందించి పక్కా సర్వేతో రాజముద్రతో ప్రచురించిన రైతులకు భూమి పట్టాదారు పాసుపుస్తకాలను అందిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి కె పవన్‌కళ్యాణ్‌లు అహర్నిశలు రాష్ట్ర అభివృద్ధి కోసం పాటుపడుతున్నట్టు గుర్తు చేశారు. అనంతరం రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందించారు. అనంతరం వెలుగు పథకం ద్వారా మన డబ్బులు-మన లెక్కలు ద్వారా మహిళా ద్వాక్ర మహిళలకు అవగాహన కల్పించారు. అంతుముందు నూతన సంవత్సర శుభాకాంక్షలు అధికారులు, కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి, జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్, మాజీ నెడ్‌క్యాప్ ఛైర్మన్ ఆర్‌డి ఏకాంబరం, మాజీ వైస్‌ఎంపిపి టి సుబ్రమణ్యం, పట్టణ టిడిపి అధ్యక్షులు అచ్చుకట్ల హరి, సర్పంచ్ కెజి శారదమ్మ గణేషన్ కుమారుడు లక్ష్మణన్, రమేష్‌బాబు, ఆరుముగం, మాజీ సర్పంచులు కెఎస్ రవి, కె సుధాబాబు, నాయకులు బిఎం నరేష్, గోవిందశెట్టి, బాలయ్య, మురళి, నాగయ్య, రమేష్, దేవరాజులు, తహశీల్దారు రోజారాణి, ఎంపిడిఓ అరుణ, ఎంఇఓలు కోదండనాయుడు, జనార్ధన్‌రాజు, వెలుగు ఎపిఎం ధనంజయరెడ్డి, ఇజిఎస్ ఎపిఓ సుఖన్య, సిసిలు నగేంద్రరాజు, రైతులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

-పోటెత్తిన జనసందోహం పోట్లగిత్తలతో పోరాటం

-పశువుల ఆకలి భాధలు పట్టని రైతన్నలు

అంబరాన్నంటిన కొత్త శానంబట్ల...

## జల్లికట్టు సంబరాలు

చంద్రగిరి, జనవరి 2 ప్రభాతవార్త: కొత్త శానంబట్లలో శుక్రవారం జల్లికట్టు సంబరాలు అంబరాన్నంటేలా నిర్వహించారు. ఏడాదికి ఒకమారు ఏరువాక ముగిశాక పశువులకు పూజలు నిర్వహించి పండుగ జరుపుకోవడం సంప్రదాయంగా వస్తున్నది. ఇందులో భాగంగా పాడిరైతులు తమ ఆవులు, ఎద్దులను ఉదయాన్నే శుద్ధి జలాలతో శుభ్రం చేశారు. కొమ్ములను నున్నగా అరగదీసి వాటికి రంగులద్దారు. చెక్కను అందంగా మలిచి కొమ్ములకు కట్టి పౌరుషంతో రంకెలేస్తున్న పశువులను జనంలోకి వదలిపెట్టారు. పశువుల కొమ్ములకు కట్టిన పట్టీని సొంతం చేసుకోవడాన్ని పౌరుషానికి ప్రతీకగా భావించే యువత పోటెత్తిన ఉత్సాహంతో ముందుకు దూకారు. యువకులు పట్టీల కోసం పోటీ పడే విధానం ఒక యుద్ధాన్నే గుర్తు చేసింది. జల్లికట్టు సంబరాలను తిలకించేందుకు వచ్చిన జనంతో కొత్త శానంబట్ల జనసంద్రాన్ని తలపించింది.

**-ఆకలి భాధలతో మూగజీవాల వేదన**

జల్లికట్టు సంబరాలకు వివిధ ప్రాంతాల నుండి ఉదయాన్నే పెద్ద ఎత్తున పశువులను వివిధ వాహనాలలో తీసుకువచ్చిన రైతులు కొత్త శానంబట్ల గ్రామంలో ముస్తాబు చేసి కట్టిపడేశారు. మధ్యాహ్నం 2 గంటల వరకు జల్లికట్టు సంబరాలు ప్రారంభం కాలేదు. పశువులకు దానా అందించక పోవడంతో ఆకలిభాధతో విలవిలలాడుతూ మూగజీవాలు వేదనను అనుభవించాయి. జల్లికట్టు సంబరాలలో సుమారు 15 మందికి పైగా గాయాలయ్యాయి. మరో ఇద్దరికి చేతులు, కాళ్ళు విరిగిన ఘటనలు చోటు చేసుకున్నాయి. దాదాపు 80 మంది పోలీసులు జల్లికట్టు సంబరాలను పర్యవేక్షించినట్లు తెలిసింది. జల్లికట్టు సంబరాలు సంప్రదాయాలను అధిగమించి మూగజీవాలు హింసకు గురవుతున్నట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు దశాబ్దాల క్రితం వరకు రైతులు తమ గ్రామంలోని పశువులతో మాత్రమే జల్లికట్లు నిర్వహించే పద్ధతి వుండేది. ప్రస్తుతం సామాజిక మాధ్యమాలలో గ్రూపులుగా ఏర్పడిన జల్లికట్టు రాయుళ్ళు ఎక్కడ సంబరాలు నిర్వహించినా తమ పశువులను తరలించి పందేరంలో నిలుపుతుండటంతో



శానంబట్లలో జల్లికట్టు ఉత్సవం - వేచివున్న పశువులు

అనేక అనర్థాలు చోటుచేసుకుంటున్నాయి. తమ పంచాయతీ పరిధిలోని పాడి పశువులతో రైతులు జల్లికట్టు సంబరాలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకున్నట్లయితే ప్రమాదాల తీవ్రతను కొంత వరకు తగ్గించే అవకాశం వుంటుంది.

## తెగుళ్ళతో రైతుల తిప్పలు

అధిక విస్తీర్ణంలో పంటల సాగు

- కిట కిట లాడుతున్న పురుగు మందుల దుకాణాలు

శ్రీకాళహస్తి, జనవరి 2 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాలు ధాన్యాగారాలుగా ఉన్నాయి. ఈ రెండు నియోజకవర్గాల్లో విస్తారంగా పంటలు పండిస్తారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది గతం కన్నా, సాధారణం కన్నా అధికంగా వరి పంటను రైతులు వేసినట్లు వ్యవసాయాధికారుల గణాంకాలు తెలుపుతున్నాయి. ఈ ఏడాది వర్షాలు అక్టోబర్ మాసంలోనే కురవటంతో రైతులు ఆనందంతో పంటలను వేసారు. ఈ రెండు నియోజకవర్గాల్లో ఓ వైపుచెరువులు, మరో బోరు బావులతో పాటు తెలుగుగంగ కాపాడుతుంది. ఈ నేపథ్యంలో రెండు నియోజకవర్గాల్లో వరి పంట సుమారు 32వేల హెక్టార్లలో వేయటం ఆనవాయితి. ఒక్క శ్రీకాళహస్తిలో సాధారణ సగటు ఉత్పత్తి 18,923 హెక్టార్లుగా ఉంది. అయితే ఇప్పటి వరకు శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 19750హెక్టార్లలో వరి పంటను వేసారు. కొందరు నాట్లు వేసుకుంటుండగా మరి కొందరి పంట పిలకల దశకు చేరుకుంది. మరి కొంత మంది ఇంకా నాట్లు దశకు రాలేదు.

**పొలం పనుల్లో అన్నదాతలు బిజిబిజి:**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురువటంతో సంక్రాంతి పండగకు ముందే పొలం పనులు పూర్తి చేయుటకు అన్నదాతలు పరుగులు తీస్తున్నారు. అయితే ఈ సారి వర్షాలు, అలాగే మంచు కురుస్తుండటంతో పంటలకు అంతగా తెగుళ్లు తక్కువే అయినా రైతులు యథాప్రకారం పంటలకు మందులు కొట్టె అలవాటుతో ఎరువుల దుకాణాల వద్ద తెగులు నివారణ మందుల కోసం వేలాడుతున్నారు. పట్టణంలోని ఏ ఎరువులు, మందుల దుకాణాల వద్ద చూసిన రద్దీ కనబడుతుంది. యూరియాను ప్రభుత్వం అందించటంతో తెగుళ్ళ నివారణ మందుల కోసం రైతులు తిప్పలు పడుతున్నారు. ఇంకా ఏ తెగులు? నివారణకు ఎం మందులు వాడాలని వ్యవసాయాధికారులను సంప్రదించే పరిస్థితికి రాలేదు. అధికారులు అందించిన సమాచారం మేరకు వరి 19750 హెక్టార్లలో వేరుశెనగ 392 హెక్టార్లలో ఉద్దులు 75 హెక్టార్లలో నూగుల 5 హెక్టార్లలో పొద్దుతిరుగుడు 3 హెక్టార్లలో వేసినట్లు వ్యవసాయశాఖ గుర్తించారు.

**గతంతో పొల్చితే తెగుళ్ళు తక్కువే: రమేష్‌రెడ్డి**

శ్రీకాళహస్తిలో పంటలకు సంబంధించి వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డిని ప్రభాతవార్త వివరణకోరగా గత ఏడాదిలో పోల్చుకుంటే ఈ సారి పంటల విస్తీర్ణం పెరిగిందని అలాగే తెగుళ్ళు కూడా తక్కువే అని వివరించారు. వరి పంటకు తెల్ల జీడ, ఆకుముడత తెగులు



ఎరువుల దుకాణాల వద్ద రైతులు

- మందులు పిచికారి చేస్తున్న దృశ్యం

ఆశించిందని అయితే వాతావరణం దృష్ట్యా తగ్గిపోతుందని తెలిపారు. కానీ రైతులు అవగాహన లేకుండా పంటలపై తెగుళ్ళు ఆశించకున్నా రైతులు మందులు పిచికారి చేస్తున్నారని వివరించారు.

## కన్నతండ్రే కూతుర్ని కాటేశాడు!

- మొదటి భార్య... మైనర్ బాలికపై అఘాయిత్యం

- పెద్దకాప్పల్లి ఎస్టీ కాలనీలోదారుణం !!

పెద్దపంజాణి, జనవరి 2 ప్రభాతవార్త: అభంశుభం తెలియని సొంత కుమార్తెపై ఓ కామాంధుడైన తండ్రి వావివరుసలు మరచి అత్యాచారంకు ఒడి గట్టాడు. దీన్ని వారించబోయిన తన తల్లిని కాళ్లతో తన్ని బాలికను లాక్కెళ్లిన పాశవిక ఘటన పెద్దపంజాణి మండలం పెద్దకాప్పల్లి పంచాయతీ ఎస్టీ కాలనీలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. ఎస్టీ కాలనీలో నివాస ం ఉంటున్న రెడ్డెప్ప కుమారుడు పెద్దప్పకు ఇద్దరు భార్యలు. కాగా గురువారం సాయంత్రం అతని పెద్ద భార్య కుమారె_ (12) పెనుగొలకల నుంచి చికెన్ తీసుకునివసు_ండగా మార్గమధ్యంలో పెద్దబండ ప్రాంతంలో కామంతో కళ్లు మూసుకుపోయిన పెద్దప్ప తన కూతుర్ని అడ్డగించి చేయి పట్టుకుని లాకె ్ళసాగాడు. ఇది గమనించిన పెద్దప్ప తల్లి పార్వతమ్మ అడ్డుపడి ప్రాధేయపడసాగిందన్నారు. అయితే పెద్దప్ప తన సొంత తల్లిపై సైతందాడి చేసి ఆమెను కాళ్లతో తన్ని తన కుమార్తెను లాక్కెళ్లిపోయాడన్నారు. పార్వతమ్మ పెద్ద ఎత్తున అరుస్తూ సాయం కోసం బంధువులను తీసుకువచ్చేందుకై బూరుగుల పల్లి ఎస్టీ కాలనీకి వెళ్లింది. అక్కడ ఆమె



తన కుమార్తె భువనేశ్వరి, తన అల్లుడు రమేష్‌ను వెంట పెట్టుకుని పరుగులు తీస్తూ పెద్దబండ ప్రాంతం వద్దకు చేరుకున్నారు. అప్పటికే బాలిక ఏడ్చుకుని వస్తుండగా బాలికను విచారించగా తన తండ్రి చేసిన దారుణాన్ని చెప్పింది. ఈ నేపథ్యంలో శుక్రవారం పార్వతమ్మ పెద్దపంజాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పలమనేరు రూరల్ సిఐ పరశురాముడు నిందితుడిపై పోక్సో చట్టం 2012తో పాటు పలు సెక్షన్లతో కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. ఈవిషయం మండలంలో సంచలనం రేకెత్తించింది.

## పాసు పుస్తకాలు పంపిణీ



**పూతలపట్టు, జనవరి 2, ప్రభాతవార్త** మండల పరిధిలో ఉన్న చిట్టి పేరాల పంచాయతీ సచివాలయం కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ బూత్ కమిటీ అధ్యక్షుడు కమలాకర్ రెడ్డి పాసు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందని రీ సర్వే జరిగి పూర్త అయిన గ్రామాలలో రైతులకు పాసు పుస్తకాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ యశ్వంత్, విఆర్ఓ మాధవి లత, తదితరులు పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం



**కాణిపాకం, జనవరి 2 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమల వుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు శుక్రవారం లక్ష రూపాయలను విరాళంగా అంద జేశారు. ఈమేరకు పూతలపటగ్టు మండలం పంట పల్లెకు చెందిన దేవరాజులునాయుడు అనే భక్తుడు నిత్యాన్నదానంకు 1,00,116 రూపాయలను విరాళం గా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ రవిలకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదా యం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## గణనాధుని దర్శించుకున్న కర్నాటక హైకోర్టు న్యాయమూర్తి

కాణిపాకం, జనవరి 2 ప్రభాతవార్త:



ముంబాయి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంతోష్ శుక్రవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ సూపరెండెంట్ వాసు, చిత్తూరు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు భూముల రీ సర్వేపై అవగాహన సభ

**తవణంపల్లె, జనవరి 2 ప్రభాతవార్త:** మండలంలోని అరగొండలో భూముల రీసర్వేపై రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించనున్నట్లు అరగొండ సింగిల్ విండో చైర్మన్ ఎ.రంజిత్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే ప్రాజెక్ట్‌లో భాగంగా ఈనెల నుండి పైమాఘం రెవెన్యూ పరిధిలోని భూముల రీసర్వే కార్యక్రమంను నిర్వహించ న్నుట్లు తెలిపారు. పట్టాదారులు ప్రజా ప్రతినిధులు తప్పక హాజరు కావాలని రంజిత్‌రెడ్డి కోరారు.

## రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి!



**తవణంపల్లె, జనవరి 2 ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో విద్యార్థి అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన మండలంలోని అరగొండ-చిత్తూరు రహదారిలోని ఐరాల క్రాస్ శ్రీవినాయక వినాయక విద్యామందిర్ పాఠశాల వద్ద బుధవారం రాత్రి జరిగింది. సంఘటనకు సంభందించి స్థానిక ఎస్సై డాక్టర్ నాయక్ కథనం మేరకు వివరాలిలావున్నాయి. కడప జిల్లా పోరుమామిళ్ళ మండలం ఎల్లవపల్లెకు చెందిన వంకరాజు సుధాకర్ కుమారుడు వంకరాజు సురేష్‌కుఉమార్(21)చిత్తూరు ఆర్‌విఎస్ నగర్‌లోని ఎస్వీసెట్‌లో చదువుతున్నాడు. ఇతను బుధవారం అర్ధరాత్రి పల్సర్ మోటారు సైకిల్‌పై అరగొండ వైపు అతి వేగంగా వస్తూ వినాయక విద్యామందిర్ స్కూల్ వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కనున్న దుకాణాన్ని డీకొన్నాడు, దీనితో తీవ్రమైన గాయాలకు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హెచ్ డాక్టర్ నాయక్ తెలిపారు.

## రైతులకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు

శ్రీరంగరాజపురం, జనవరి 2 ప్రభాతవార్త:

మండల పరిధిలో రీ-సర్వే పూర్తయిన నాలుగు గ్రామాల్లోని రైతులకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు తహసిల్దారు లోకనాథపిళ్ళై పేర్కొన్నారు. చొక్కమడుగు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రీ-సర్వే రైతులకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో తహసిల్దారు లోకనాథపిళ్ళై రైతులకు కొత్త పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గంథమనేని జయశంకర్‌నాయుడు, మాజీ అధ్యక్షులు భాస్కర్‌నాయుడు, జిల్లా ఎస్సీ సెల్ నాయకులు చొక్కమడుగకు కుమార్, మండల అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి సమస్యను పరిశీలించి పరిష్కారం : ఎమ్మెల్యే



**యాదమరి, జనవరి 2 ప్రభాతవార్త:** ప్రజల నుండి సమస్యలపై వచ్చిన ప్రతి అర్జీలు పరిశీలించి సత్వరం సమస్యను పరిష్కరించాలని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అధికారులను ఆదేశించారు. ఎంపిడిఓ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ ప్రజా దర్బార్ కార్యక్రమానికి మండలంలోని ప్రజలు పెద్ద ఎత్తున హాజరై ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహహన్‌కు తమ సమస్యలను విన్నవించి అర్జీలు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా అక్కడే వున్న తహసిల్దారు, ఎంపిడిఓలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల నుండి సమస్యలపై అందిన ప్రతి అర్జీని పరిశీలించి సమస్య పరిష్కారం అయితే పరిష్కరించాలని, లేకుంటే పరిష్కారం కాదని స్పష్టత ఇవ్వాలని చెప్పారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన కొంత మంది రైతులకు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ కొత్త పట్టాదారు పాసు పుస్తకాలకు అందజేశారు. ఈ కార్యక్రమం లో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మురార్జీ, ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌రబ్బీ, జిల్లా తెలుగుదేశం కార్యదర్శి హేమగిరినాయుడు, రాష్ట్ర తెలుగుదేశం నాయకులు అమరనాధనాయుడు, తహసిల్దార్ పార్థసారధి, ఎంపిడిఓ పెంచల వీరేంద్ర, ఉపాధి ఎపిఓ సంథ్య, మండల విద్యాశాఖ అధికారి హెచ్‌ఎల్ఎన్ ప్రసాద్, వెలుగు ఎపిఎం ఈశ్వరీ, పంచాయతీరాజ్ ఎఇ జయచంద్రారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు

## అయ్యప్పస్వామికి పడి పూజ



**బంగారుపాళ్యం, జనవరి 2 ప్రభాతవార్త:** స్థానిక ముత్యాలమ్మ ఆలయంలో అయ్యప్పస్వామికి భక్తులు వైభవంగా పడి పూజ కార్యక్రమం నిర్వహించారు. వివిధ పుష్పాలతో అయ్యప్పస్వామి, శ్రీవినాయక, శ్రీసుబ్రమణ్యస్వాములను అలంకరించారు. 18 మెట్ల పడిని వివిధ పుష్పాలతో అలంకరణ చేపట్టి పడి పూజ కార్యక్రమంను అయ్యప్ప భక్తులచే నిర్వహించారు. గురుస్వామి రమేష్ ఆధ్వర్యంలో ఈ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో స్వాములు గిరిబాబు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా సూత్రాలతోనే ప్రమాదాలకు అడ్డుకట్ట

- అర్టీసీ డ్రైవర్లకు డిఎస్పీ సాయినాథ్ సూచన



**చిత్తూరుహెల్త్, జనవరి 2 ప్రభాతవార్త:** రోడ్డు భద్రతా సూత్రాలతోనే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయగలమని, ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలను పక్కాగా పాటించాలని డిఎస్పీ సాయినాథ్ పేర్కొన్నారు. చిత్తూరు అర్టీసీ వన్ డిపోలో శుక్రవారం వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ మహేశ్వర్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డిఎస్పీ సాయినాథ్ మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ ప్రాణాల విలువ తెలుసుకుని తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి బస్సు నడుపాలన్నారు. మొబైల్ ఫోన్ వాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదాలకు ప్రధాన కారణమన్నారు. అలాగే మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం చట్ట విరుద్ధమే కాకుండా మనతో పాటు ఇతర ప్రాణాలకు ముప్పు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ త్యారాజులు, వన్ డిపో మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధారణతోనే ప్రాణాలు సురక్షితం : డిఎస్పీ

పలమనేరు, జనవరి 2 ప్రభాతవార్త:



ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడిపితే వారి ప్రాణాలు సురక్షితమని పలమనేరు డిఎస్పీ దేగల ప్రభాకర్ అన్నారు. పలమనేరులో మెకానిక్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం హెల్మెట్ వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మాజరైన డిఎస్పీ దేగల ప్రభాకర్ ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు, పెద్ద ఎత్తున ద్విచక్ర వాహనదారులు పాల్గొన్నారు.

## కర్ణాటక మద్యం పట్టివేత

బైరెడ్డిపల్లి, జనవరి 2 ప్రభాతవార్త:

స్థానిక గంగమ్మగుడి సమీపంలో టువీలర్‌లో వెళ్తున్న వ్యక్తి నుంచి కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని పోలీసులు సీజ్ చేశారు. తమిళనాడులోని ఆంబూరుకు చెందిన మహేష్ అనే వ్యక్తిని అదుపులో తీసుకోగా వినోద్ అనే వ్యక్తి పరారైనట్లు చెప్పారు. రూరల్ సిఐ పరశురాముడు ఆదేశాలతో హెచ్‌సి రామకృష్ణ, సిబ్బంది సుబ్రమణ్యం, గణేష్, వాసులు పక్కా సమాచారంతో నిందితుడ్ని అదుపులో తీసుకుని మద్యంను స్వాధీనం చేసుకున్నారు.

## పారదర్శకంగా రేషన్ పంపిణీ

చిత్తూరురూరల్, జనవరి 2 ప్రభాతవార్త:



ప్రజాపంపిణీ వ్యవస్థలో ఎక్కడా అక్రమాలకు తావులేకుండా పూర్తి పారదర్శకతతో రేషన్ సరకుల పంపిణీ జరగాలన్నదే ఎన్డీయే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని 37వ డివిజన్ బిజెపి ఇన్‌ఛార్జ్, సెంట్రల్ మండల అధ్యక్షుడు జి షణ్ముగం పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, బిజెపి జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర నాయుడుల ఆదేశాల మేరకు రేషన్ షాపుల వద్దకు వెళ్లి రేషన్ కార్డుదారులకు అందజేస్తున్న బియ్యం, చక్కెర, రూ.20లకు గోధుమపిండిల పంపిణీని పరిశీలించారు.

## కొత్త మార్గదర్శకాలతో రిసర్వే ఎంఆర్ఓ

బైరెడ్డిపల్లి, జనవరి 2 ప్రభాతవార్త:



బైరెడ్డిపల్లి మండలంలో కొత్తగా రూపుదిద్దుకున్న మార్గదర్శకాలతో రీ సర్వేను జనవరి రెండో తారీఖున ప్రారంభించడం జరిగినది. ఈరోజు జరిగినటువంటి రీ సర్వేలో కమ్మనపల్లి, గంగినాయన పల్లి, ధర్మపురి పంచాయతీలలో జరిగినది. చప్పిడి పల్లి పంచాయతీలో పాసుబుక్కులను ఎమ్మార్వో ప్రసన్నకుమార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ దామోదర చారి రైతులకు పంపిణీ చేశారు. ఈ సర్వే కార్యక్రమంలో మండల సర్వేయర్ నరేష్, పంచాయతీ సర్వేర్లు వీఆర్వో, వీఆర్ఏలు పాల్గొన్నారు.

## బల్ల పంచాయతీలో సమస్యలు పరిష్కరించండి

రామకుప్పం, జనవరి 2 ప్రభాతవార్త:



మండలంలోని బల్ల గ్రామపంచాయతీలో గత నెల 31న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ విలువలబడి కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామస్తులు పలు సమస్యల పైన ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువచ్చారు. శుక్రవారం టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ స్థానిక నేతలతో కలిసి తహసిల్దార్ కౌలేష్‌కు బల్ల సమస్యల పైన విన్నవించారు. ఆరుమానపెంట నుంచి గోవిందపల్లి మీదుగా రాళ్ల బుదుగురు వరకు డబుల్ రోడ్డు వేయాలన్నారు. హై స్కూల్ లోని అసంపూర్ణంగా ఉన్న ప్రహరీ గోడను పూర్తి చేయాలన్నారు. అదనపు గదులు కూడా ఏర్పాటుకు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు నరసింహులు, పిఎసిఎస్ చైర్మన్ మహమ్మద్ రఫీ, సురేష్ పాల్గొన్నారు.

## 1.పిఆర్‌టియు క్యాలెండర్ ఆవిష్కరణ

**గంగాధర నెల్లూరు జనవరి 2 ప్రభాతవార్త:** పిఆర్‌టియు ఉపాధ్యాయ శాఖ నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక ఎంఇఒలు ఆంజనేయులుశెట్టి, గుణశేఖర్ రెడ్డిలు శుక్రవారం స్థానిక ఎంఇఒ కార్యాలయంలో ఆవిష్కరించారు. గౌరవ అధ్యక్షులు గంగాధరం అధ్యక్షులు చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పట్ల నిర్విరామంగా స్పందించి పోరాడే ఎకైకశాఖ మాదే అని అన్నారు. ఈ కార్యక్రమంలో శాఖ ప్రధాన కార్యదర్శి పురుషోత్తం నాయకులు రాజేందర్ రెడ్డి చలపతి మోహన్‌రెడ్డి పవన్ కమలనాధరెడ్డి సుధాకర్ చంద్రశేఖర్‌రెడ్డి రాజేష్ తదితరులుతో పాటు శాఖ ఉపాధ్యాయునపి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ

వెదురుకుప్పం, జనవరి 2 ప్రభాతవార్త :



మండలంలోని బ్రాహ్మణపల్లె సచివాలయంలో శుక్రవారం సర్పంచ్ బట్టే శిరీష చాణిక్య ప్రతాప్ ఆధ్వర్యంలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు గురసాల కిషన్ చంద్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత ప్రభుత్వంలో జరిగిన రెవెన్యూ మోసాలను గుర్తించి రైతులు నష్టపోకుండా వారి ఆస్థిల పై వారికే హక్కు కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వ రాజముద్రతో పాసుపుస్తకాలకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. వైసీపీ పాలనలో జగన్ రెడ్డి ఫోటోతో రైతులకు పట్టాదారు పుస్తకాలు పంపిణీ చేసి మోసం చేయాలని చూరశారని ఆరోపించారు. అనంతరం మంజూరై పాసుపుస్తకాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహశీల్ధార్ చంద్రశేఖర్, సచివాలయం కార్యదర్శి బాలసుబ్రమణ్యం, విఆర్‌వో ధనశేఖర్, గ్రామ కమిటీ అధ్యక్షులు కోదండ రెడ్డి, బూత్ కన్వీనర్ దామోదర్ రెడ్డి, గ్రామ కమిటీ కార్యదర్శి తాతి రెడ్డి జయచంద్రా రెడ్డి, సీనియర్ నాయకులు పుల్లూరు సుధాకర్ రెడ్డి, బాబు, యువ నాయకులు మురళీ మోహన్‌రెడ్డి, రోహిత్, భాను తదితరులు పాల్గొన్నారు.

## చౌడేశ్వరి దేవి ఆలయంలో విశేష పూజలు

వెదురుకుప్పం, జనవరి 2 ప్రభాతవార్త :



మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయితీ పరిధిలో రేంటాలచేను గ్రామంలో నూతనంగా నిర్మించిన చౌడేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని విశిష్టంగా అలంకరించి వేడుకగా మంగళవాద్యల నడుమ ఊరేగింపు చేశారు. అమ్మవారి ఆలయ నిర్మాణం కొరకు స్థలం దానం చేసిన దాత దామోదర్‌రెడ్డి దపంతులను ఆలయ నిర్వహకులు దుశాలువతో ఘనంగా సన్మానించారు. ఉభయదాతగా సవిరెడ్డి సురేష్‌రెడ్డి వ్యవహారించారు. ఈ కార్యక్రమంలో ఆయల ధర్మకర్త సవిరెడ్డి కృష్ణ ప్రసాద్ రెడ్డి, కార్యనిర్వహకులు ధనంజేయులురెడ్డి, రామచంద్రారెడ్డి, చెన్నకేశవరెడ్డి, సాయికుమార్ రెడ్డి, వెంకటాద్రి నాయుడు, చెంచుగుడి, పెరుమాళ్ళపల్లె, పాల్యంకోత్తూరు, ఎజ్జుపల్లె, తదితర గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేశారు.

## ఎస్ఐను సన్మానించిన బిజెపి నాయకులు

వెదురుకుప్పం, జనవరి 2 ప్రభాతవార్త :



వెదురుకుప్పం ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన నవీన్ బాబును శుక్రవారం మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు బోడి రెడ్డి అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో మార్యదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. దుశాలువ సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంకు పెద్ద పీఠవేయడం జరుగుతుందని చెప్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ఎస్టీ మోక్ష అధ్యక్షులు శేఖర్, మండల ఉపాధ్యక్షులు శంకర్ రెడ్డి, మోహన్ రెడ్డి, మాజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు హనుమంత రెడ్డి, సీనియర్ నాయకులు విజయ్ రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, రాజేంద్ర రెడ్డి, పోతగంటి సిద్దయ్య తదిరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేచే 'ఉత్తమ కార్యకర్త' సర్టిఫికేట్ల ప్రదానం

చిత్తూరురూరల్, జనవరి 2 ప్రభాతవార్త:



కార్యకర్తలకు గుర్తింపు తెచ్చిన పార్టీ తెలుగుదేశం పార్టీ మాత్రమేనని, కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఇవ్వడంలో తెలుగుదేశం పార్టీ ముందుంటుందని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయం ప్రజాదర్బార్ నందు ఏర్పాటుచేసిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు ఉత్తమ కార్యకర్త సర్టిఫికేట్లను ఎమ్మెల్యే ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో చుడా చైర్‌పర్సన్ కఠారిహేమలత, మాజీ ఎమ్మెల్సీ బిఎన్ రాజసింహులు, మాజీ జడ్పీటిసి బాలాజీనాయుడు, మాజీ ఎంపిపి దీపశ్రీ, మొదలియార్ కార్పొరేషన్ చైర్మెన్ త్యాగరాజన్, రఘు, ప్రతాప్‌నాయుడు, వెంకటేష్‌యాదవ్, అనురాధ, మోహన్‌రాజ్, శ్యామ్, కాజూరుబాలాజీ, మంజూష్, రాజశేఖర్, నీరజాక్షులునాయుడు, బాలసుబ్రమణ్యం, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## రైతులకు న్యాయం చేయడమే ప్రభుత్వం లక్ష్యం



- పికెఎం ఉడా ఛైర్మన్ డా॥బిఆర్ సురేష్‌బాబు

కుప్పం, జనవరి2 ప్రభాతవార్త:

వైఎస్సార్సీ పాలనలో దగా పడ్డ రైతులకు న్యాయం చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. శుక్రవా రంమండలంలోని ఉర్ల ఓబనపల్లి గ్రామంలో రైతుల కునూతన పట్టాదారు పాసు పుస్తకాలను గ్రామసభలో పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ గత వైఎస్సార్సీ పాలనలో వైఎస్ జగన్ రైతుల పాసు పుస్తకాలకు తన ఫోటోలు ము ద్రించుకుని స్వప్రచారం చేయించుకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో తహశీల్దార్ చిట్టిబాబు, టిడిపి మండలఅధ్యక్షుడు రాజగోపాల్, ఎపిఐఐసిడైరెక్టర్ ప్రేమ్‌కుమార్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, మాజీ ఎంపిపి వెంకటేష్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జ్లు శ్రీనివాసులు, కన్నన్, కో ఇన్‌చార్జ్ వేడి, రైతులు పాల్గొన్నారు.

## రైతుల అభ్యున్నతికి సిఎం చంద్రబాబు కృషి : ఎఎంసి ఛైర్మన్



**గుడుపల్లె, జనవరి 2 ప్రభాతవార్త:** రైతుల అభ్యున్నతికి సిఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారనిఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు పేర్కొన్నారు. శుక్రవారం బెగ్గిలపల్లి గ్రామంలో రైతులకు ప్రభుత్వం తరపున నూతన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీని ఆయన ప్రారంభి ంచారు. అనంతరం మాట్లాడుతూ వైకాపా పాలనలో రైతుల కష్టాలు చెప్పనలవికాదన్నారు. రైతుల భూములకు సంబంధించిన పుస్తకాలపై వైఎస్ జగన్ తన ఫోటోలు వేయించుకున్న సంఘటనలు జరిగాయన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సీతారాం, కడ సభ్యుడు వెంకటేష్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## కంగుందిలో బౌల్డరింగ్ ఫెస్టివల్ ఏర్పాట్ల పరిశీలన

కుప్పం, జనవరి 2 ప్రభాతవార్త:



మండలంలోని కంగుంది గ్రామంలో ఈనెల 6-10 తేదీల్లో నిర్వహించే బౌల్డరింగ్ ఫెస్టివల్ 2026కు సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, ఆరీ ్డఓ శ్రీనివాసులురాజు పరిశీలించారు. స్థానిక శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాల పైన గుట్టపై ఏర్పాటుచేసిన బౌల్డరింగ్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. ఫెస్టివల్ నిర్వహణకు ఎంపిక చేసిన ప్రాంత ం, రాకపోకల సౌకర్యాలు, మంచినీరు, విద్యుత్ వసతి, వైద్యసౌకర్యం, భద్రతల చర్యలపై సమగ్రంగా సమీక్షించారు. కార్యక్రమంలో తదేకం ఫౌండేషన్ నిర్వాహకులు మేజర్ జనరల్ సంజయ్, ఎఫ్‌ఆర్వో జయశంకర్, సర్పంచ్ ధనశేఖర్, వైస్ సర్పంచ్ తిరుపతి, ఎడి పల్లవి, విఆర్వో శ్రీనివాసులుగౌడ, కార్యదర్శిశ్రీనివాస్, పార్టీఅధ్యక్షుడు షరీఫ్, సీనియర్ నేత విసి మంజునాథ్ పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలోనే పారదర్శక పాలన

- ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

కుప్పం, జనవరి 2ప్రభాతవార్త:



సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలోనే పారదర్శక పాలన కొనసాగుతోందని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లిలో రైతులకు నూతన పట్టాదారుపాస్ పుస్తకాల పంపిణీని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గత పాలకుల సా ్వర్థంతో రైతుల భూముల వివరాల్లో తప్పులు దొర్లడంతో పాటు వ్యక్తిగత ఫోటోలు ముద్రించి రైతులను ఇబ్బందుల పాలు చేశారన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ చిట్టిబాబు, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, పిఎసిఎస్‌ఛైర్మన్ కృష్ణమూర్తి, కడ సభ్యుడు రామచంద్ర, నేతలు సత్యేంద్రశేఖర్, సుబ్బు, సుబ్రమణ్యం, చంద్రప్ప, కదిరప్పతదితరులు పాల్గొన్నారు.

## బిఆర్‌డి ఆర్థో..ఇఎన్‌టి క్లినిక్ ప్రారంభం

కుప్పం,జనవరి2 ప్రభాతవార్త:



పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలనే ఆశయంతో బిఆర్‌డి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి డైరెక్టర్ బిఆర్ సురేష్‌బాబు అధ్వర్యంలో స్థానిక ప్యాలస్ రోడ్డులో నూతనంగా బిఆర్‌డి ఆర్థో, ఇఎన్‌టిక్లినిక్‌ను తెదేపా రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్ ప్రారంభించారు. ఈసందర్భంగా బిఆర్ సురేష్‌బాబు మాట్లాడుతూ సీనియర్ ఆర్థోసర్జన్ లోకేష్ గౌడ ఇక్కడ అందు బాటులోఉ ంటారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, నేతలు డా॥ వెంకటేష్, ఎల్లప్ప, శివ, గిరిధర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## రాయితీ ఇ- సైకిళ్లపై ప్రజలకు అవగాహన

కుప్పం, జనవరి 2 ప్రభాతవార్త:



సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం నియోజకవర్గంలో ప్రజలకు రాయితీతో ఇ-సైకిళ్లను పంపిణీ చేయనున్నారు. దీనిపై స్థానిక మూడో సచివాలయం వద్ద మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాకీర్ నేతృత్వంలో ఆంధ్రప్రగతి బ్యాంక్ సిబ ్బంది ప్రజలకు అవగాహనకల్పించారు. 34వేల విలువ చేసే ఇ-సైకిల్‌ను రాయితీతో 24వేలకు అందిస్తు న్నట్లు చెప్పారు. కార్పోరేషన్‌డైరెక్టర్ వేణుగోపాల్, రెస్కో డైరెక్టర్ ఆర్ముగం, బూత్ ఇన్‌చా ర్జ్ లోకేష్, మల్లయ్యనాయుడు, ప్రసాద్, సురేష్, ఒకేషనల్ కాలేజ్ అధ్యాపకులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## సంజీవని పథకం పేదలకు వరం : డిఎంహెచ్ఓ

వి.కోట, జనవరి 2 ప్రభాతవార్త:



సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో వైద్య ఆరోగ్యశాఖ చేపట్టే సంజీవని పథకం పేదలకు వరం లాంటిదని డిఎంహెచ్ఓ డా॥ సుధారాణి పేర్కొన్నారు. శుక్రవారం ఓగు పిహెచ్‌సిలో ఆమె తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ త్వరలో చిత్తూరు జిల్లాలో సంజీవని పథకం అమలవుతుందన్నారు. ప్రజలందరికీ అభ ఐడి, మొబైల్‌నెంబర్లు సేకరించ డంతో పాటు వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వివరాలను డిజిటల్ రూపంలో చేర్చడం జరుగుతుం దన్నారు. ప్రతియాప్‌లో వివరాలు వ ందశాతం అప్‌డేట్ చేయాలన్నారు. కార్యక్రమంలో డి.డిఎంహెచ్ఓ డా॥ వెంకట ప్రసాద్, డా॥ ప్రవీణ, జార్జ్, శ్రీవాణి, రామ్మోహన్, స్థానిక వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పిఆర్‌టియు కేలండర్ల ఆవిష్కరణ

వి.కోట, జనవరి 2 ప్రభాతవార్త:

పిఆర్‌టియు ఉపాధ్యాయ సంఘ నూతన కేలండర్లను ఎంఇఒలు చంద్రశేఖర్, మురుగేష్, సంఘ జిల్లా అధ్యక్షుడు డా॥ కన్నన్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయపాల్, పురుషోత్తం ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ మహిళా టీచర్ల ఛైల్డ్‌కేర్ సెలవులకు వయోపరిమితి తొలగించడంతో పాటు మెడికల్ రీఎంబర్స్‌మెంట్ పాతిక లక్షలకు పెట్టడం, ఉపాధ్యాయుల తల్లిదండ్రులు మరణిస్తే పదిహేను రోజుల సెలవు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతామన్నారు.

## రైతులకు నూతన పాస్‌పుస్తకాలు పంపిణీ

పెద్దపంజాణి, జనవరి 2ప్రభాతవార్త:



మండలంలోని శ ంకరరాయలపేట, శివాడి పంచాయ తీల్లో శుక్రవారం ప్రభుత్వం ద్వారా నూతనంగా మం జూరైన పాసు పుస్తకాలను రైతులకు తహశీల్దార్ హనుమంతు నాయక్ పంపిణీ చేశారు. ఇదివరకు రీ సర్వే జరిగిన గ్రామాల్లోని రైతులకు కొత్త పుస్తకాలు అందిస్తున్నటు తహశీల్దార్ తెలిపారు. సర్పంచ్ హరినాథ్, రైతులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## ఎంపిడిఓచే స్పెషల్ క్లాసులు పరిశీలన

**పెద్దపంజాణి, జనవరి 2 ప్రభాతవార్త :** ప్రభుత్వం టెన్త్ విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను శుక్రవారం రాయలపేట జడ్పీహైస్కూల్‌లో ఎంపిడిఓ బాలాజీ పరిశీలించారు. 129మంది విద్యార్థులకు గాను 12మంది గైర్హాజరు అయినట్లు హెచ్ఎం అన్నపూర్ణ తెలిపారు. అనంతరం ఎంపిడిఓ మాట్లాడుతూ ప్రభుత్వం టెన్త్ విద్యార్థులకు అమలు చేస్తున్న వంద రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.



## ముదిరాజుల ఆత్మీయ సమావేశం

శ్రీకాళహస్తి, జనవరి 2 ప్రభాతవార్త:

పట్టణంలోని సరోజినిదేవి కళ్యాణ మండపంలో వివిధ పదవులు పొందిన నాయకులకు ముదిరాజ్ సంఘం సారధ్యంలో శుక్రవారం పట్టణంలోని సరోజిని కళ్యాణ మండపంలో సన్మాన కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఇటీవల కాలంలో పదవులు పొందిన వారికి పూలమాలలతో దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ ముదిరాజులు ఆర్థికంగా విద్యపరంగా మన వంతు సహాయసహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు రమణయ్య,కార్యదర్శి పి.బత్తినయ్య తంగేళ్ళపాళెం సింగిల్ విండో చైర్మెన్ భీమాల భాస్కర్,మండల టిడిపి ప్రధాన కార్యదర్శి సి.బాలసుబ్రమణ్యం, కట్టపుట్టాలమ్మ చైర్మెన్ పి.రాజేంద్ర, ఎ.వెంకటేశ్వర్లు, అంకయ్య, నాగరాజు,వేణు,చంద్రబాబు,జయరాంరెడ్డి,శ్రీను పాల్గొన్నారు.

## ఎంపిని కలిసిన కోగిల



తొట్టంబేడు జనవరి 2 ప్రభాతవార్త:

తిరుపతి ఎంపి మద్దిల గురుమూర్తిని శుక్రవారం ఆయన నివాసంలో తొట్టంబేడు మండల వైకాపా పార్టీ అధ్యక్షులు కోగిల సుబ్రమణ్యం, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు నాగోలు వెంకటరమణారెడ్డిలు కలిసి దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ తొట్టంబేడు మండలంలో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

## విఆర్ఓను అభినందించిన యాదవ్



శ్రీకాళహస్తి,జనవరి 2 ప్రభాతవార్త :

మండలం ముచ్చివోలు గ్రామానికి చెందిన విఆర్ఓ పూర్ణిమను మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అక్షింతల కృష్ణయాదవ్ శుక్రవారం సన్మానించారు. రైతులకు ప్రభుత్వం కొత్తగా రాజముద్రతో పాస్‌పుస్తకాలు ఇవ్వటానికి ప్రకటించినపుడు పూర్ణిమ ఎంతో జవాబుదారి తనంతో సచివాలయ పరిధిలోని రైతులకు సంబంధించిన వివరాలను కంప్యూటరీకరణ చేయటంతో ప్రభుత్వం ప్రకటించిన మొదటి రోజూ రైతులకు పాస్ పుస్తకాలు ఇచ్చే అవకాశం వచ్చినందుకు ఆమెను సత్కరించారు.

## శానంబట్ల వద్ద పేకాట రాయుళ్ల అరెస్ట్

**చంద్రగిరి, జనవరి 2 ప్రభాతవార్త:** శానంబట్ల వద్ద శుక్రవారం 7 మంది పేకాట రాయుళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. సిఐ సురేష్ కుమార్ కు అందిన రహస్య సమాచారంతో ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బందితో ఆకస్మిక దాడులు చేయించారు. శానంబట్ల వద్ద స్వర్ణముఖీ నదిలో నిర్వహించిన ఈ దాడుల్లో 7 మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి వారి నుండి రూ.70వేలు నగదు సహా ఒక ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రాష్ట్ర అభివృద్ధిపై విజయానంద్ సమీక్షా

తిరుపతి కలెక్టరేట్, జనవరి 2 ప్రభాతవార్త :

ఏపీ సచివాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి శుక్రవారం సాయంత్రం సానుకూల ప్రజా దృక్పథం, ఏజెంట్ స్పేస్ కోసం డాక్యుమెంట్ అప్‌లోడ్, ప్రభుత్వ ఆసుపత్రుల్లో, ఆలయాల్లో సౌకర్యాలు, ఆర్ ఓ ఆర్ సర్వే, వ్యవసాయం (యూరియా సరఫరా), దాన్య సేకరణ, వాహన పోర్టల్, వాహనాల టాక్స్ వసూళ్ళు, సారథి పోర్టల్, అగ్నిమాపక అనుమతులు తదితర అంశాలపై అన్ని జిల్లా కలెక్టర్ల తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సమీక్ష నిర్వహించగా తిరుపతి జిల్లా నుండి ఆన్లైన్ ద్వారా జిల్లా కలెక్టర్ డా ఎస్.వెంకటేశ్వర్ పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఇంచార్జి జాయింట్ కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య, జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, వ్యవసాయ శాఖ జె.డి. ప్రసాద్, డిసి హెచ్ఎస్ ఆనంద మూర్తి, డి. ఎం. అండ్ హెచ్ ఓ. బాలకృష్ణ నాయక్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌టియు కార్యవర్గం నూతన క్యాలెండర్ ఆవిష్కర



పాలసముద్రం, జనవరి 2 ప్రభాతవార్త :

మండలం లోని ఎంఆర్సి కార్యాలయము నందు శుక్రవారం మండల ఎస్టీయూ అధ్యక్షులు వి వెంకటేశన్ అధ్యక్షతన ఎస్‌టియు డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు నూతన క్యాలెండర్ మరియు డైరీని అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గౌరవ మండల విద్యాశాఖ అధికారి శ్రీ పి రాజేంద్రప్రసాద్,అదనపు మండల విద్యాశాఖ అధికారిణి శ్రీమతి వీ గిరిజ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు మీనాక్షి హరిత, శ్రీహరి, మురళీకృష్ణ మరియు శ్రీ శేషాద్రి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు ప్రధాన కార్యదర్శి శ్రీమతి శ్యామలమ్మ ,ఆర్థిక కార్యదర్శి శ్రీ నాగరాజు, ఉన్నత పాఠశాలల కన్వీనర్లు, రాష్ట్ర , జిల్లా, మండల ఎస్‌టియుప్రతినిధులు,ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులు, సిఆర్ఎంటిలు,ఎం ఆర్ సి సిబ్బంది పాల్గొన్నారు.

## ధ్యానం ఒత్తిడికి విరుగుడు



తిరుపతి యూనివర్సిటీ, జనవరి 2 ప్రభాతవార్త:

తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం (శీశిలీజుజు) మరియు యోగద సత్సంగ ధ్యాన కేంద్రం, తిరుపతి సంయుక్త ఆధ్వర్యంలో ధ్యానంఒత్తిడి, ఆందోళన మరియు కలవరానికి విరుగుడు" అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాసాన్ని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథిని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. రజని సభకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమానికి యోగద సత్సంగ సమాజం, రాంచీ ఉపాధ్యక్షులు స్వామి స్మరణానంద ముఖ్య అతిథిగా పాల్గొని ఉపన్యాసించినారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ కె. ఉష సమన్వయం చేశారు. అధ్యాపకులు, విద్యార్థులు మరియు ఇతరులు పాల్గొన్నారు

## భక్తులకు అన్నదానం



తిరుపతి,జనవరి 2ప్రభాతవార్త:

పవిత్రమైన వైకుంఠ ద్వార ఘడియల్లో రాయలసీమరంగస్థలి కళాసంస్థ చైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి తాతయ్యగుంట గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి అభిషేకసేవతోబాటు శక్తిస్వరూపిణి గంగమ్మను దర్శించుకున్న భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గుండాల గోపీనాధరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, కెవిన్ రాజ, చంగల్రాయులు, జేజిరెడ్డి,వెంకటరత్నం, కట్టమంచి చంద్రబాబు,భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

## టిటిడి అదనపు ఈఓను కలిసిన ఏపిజెఎఫ్‌నాయకులు



**తిరుపతి,జనవరి 2ప్రభాతవార్త:** టిటిడి అదనపు ఇఒ వెంకయ్య చౌదరిని శుక్రవారం తిరుమలలో ఆయన కార్యాలయంలో తిరుపతి జిల్లాఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిద్దెనేని హరిబాబు, సభ్యులు అరవ జయపాల్, గల్లా మహేష్, రాజేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేస్తూ, పాత్రికేయులకు, వారి కుటుంబ సభ్యులకు గతంలో లేని విదంగా వైకుంఠ ద్వాదశి రోజున నేరుగా స్వామి వారిదర్శనంచేయించడాన్నిసంతోషంతోఅభినందనలు తెలుపుతూ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఎస్‌పిడిసిఎల్‌లో 46 మందికి పదోన్నతులు

-చీఫ్ ఇంజనీర్లుగా కృష్ణారెడ్డి, సంపత్ కుమార్



**తిరుపతి, జనవరి 2 ప్రభాతవార్త:** ఎస్‌పిడిసిఎల్‌లో 46 మంది ఉద్యోగులకు పదోన్నతి కల్పిస్తూ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సూపరింటెండింగ్ ఇంజనీరుగా విధులు నిర్వహిస్తున్న ఎం. కృష్ణారెడ్డికి చీఫ్ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్) గానూ, శ్రీసత్యసాయి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ గా విధులు నిర్వహిస్తున్న కే. సంపత్ కుమార్ కు చీఫ్ జనరల్ మేనేజర్ (క్వాలిటీ కంట్రోల్ !! ప్లానింగ్) గానూ పదోన్నతి కల్పించారు. అదేవిధంగా తిరుపతి సర్కిల్ ఎంఆర్ టి విభాగపు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా విధులు నిర్వహిస్తున్న పి. రవికుమార్ కు సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎంక్వైరీ !! అసెస్మెంట్) గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే నెల్లూరు సర్కిల్లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా విధులు నిర్వహిస్తున్న కె. వెంకట పవన్ కుమార్ కు తిరుపతి ఎంఆర్ టి విభాగపు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పదోన్నతి కల్పించారు. వీరితోపాటు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా విధులు నిర్వహిస్తున్న సి. హరి ప్రసాద్, సి. విజయ వెంకటేష్ లకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు గానూ, జూనియర్ ఇంజనీర్ స్థాయి నుంచి అసిస్టెంట్ ఇంజనీర్లుగా 28 మందికి, గ్రాడ్యుయేట్ జూనియర్ ఇంజనీర్ నుంచి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా 6 మందికి, జూనియర్ పర్సనల్ ఆఫీసర్ నుంచి పర్సనల్ ఆఫీసర్లుగా నలుగురికి, జూనియర్ అసిస్టెంట్ నుంచి సీనియర్ అసిస్టెంట్లుగా ఇద్దరికి పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## రహదారి భద్రతపై అవగాహన

**తిరుపతి రవాణ,జనవరి 2ప్రభాతవార్త:** 37 వ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ ఆదేశాల మేరకు మోటార్ వాహనాల తనిఖీ అధికారి కె. అతిక నాజ్ స్థానిక ఎస్ జి ఎస్ ,ఎస్ వి ఓరియంటల్ హై స్కూల్ లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. రహదారి భద్రత ట్రాఫిక్ సిగ్నల్స్ తప్పనిసరి,హెచ్చరిక సంకేతాల గురించి విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. రహదారి భద్రత వైద్యురాలు డాక్టర్.పూజ వాణి ఉపాధ్యాయ మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే సహాయక చర్యలు, మానవ ప్రాణం విలువలను తెలియచేసారు. ఇందులో స్కూల్ యాజమాన్యం చంద్రయ్య,సిబ్బంది, వే ఫౌండేషన్ అంకయ్య పాల్గొన్నారు.

## డైరీలు, క్యాలెండర్లను ఆవిష్కరణ



**పాకాల, జనవరి 2 ప్రభాతవార్త:** మండలంలో స్థానిక ఎంఈఓ కార్యాలయం నందు ఎస్‌టియు 2026వ సంవత్సరపు క్యాలెండర్లు, డైరీలు పాకాల మండల విద్యాశాఖ అధికారులు బాబ్జి, లింగయ్య చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్, అన్సర్ భాషలు మాట్లాడుతూ మండలంలోని ఉపాధ్యాయులకు ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని విద్యాశాఖ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నవీన్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, మండల అసోసియేటివ్ ప్రెసిడెంట్ ప్రభాకర్, జిల్లా కౌన్సిలర్లు బిక్కా మునీంద్ర, దలవాయి వెంకటాద్రి, మండల నాయకులు సమద్, వెంకటేష్, రెడ్డప్ప, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## జిసిటీఏ కాలమానిని ఆవిష్కరణ



పాకాల, జనవరి 2 ప్రభాతవార్త:

పాకాల స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు గవర్నమెంట్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ (జిసిటిఎ) కాలమానాన్ని (క్యాలెండర్) స్థానిక ప్రభువ్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు ఎస్‌వి. రమేష్ కుమార్ శుక్రవారం కళాశాల నందు ఆవిష్కరించారు. ఆయన కాల మానాన్ని అధ్యాపకులకు ఉపయుక్తకరంగా చక్కగా రూపొందించారని అన్నారు. ఈ కార్యక్రములో జోనల్ కార్యదర్శి డా. ఈశ్వర్ బాబు యూనిటీ కార్యదర్శి డా. రమణమ్మ సభ్యుల మాసులామణి, చిట్టి కళావతి, మోహనో బెహరా, రేఖ తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ అర్హత పరీక్షకు ఉచిత శిక్షణ

**తిరుపతి విద్య, జనవరి 2 ప్రభాతవార్త:** ఐటీఐ రెండు సంవత్సరాల కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సులో డైరెక్టర్‌గా 2వ సంవత్సరంలో చేరేందుకు నిర్వహించే అర్హత పరీక్షకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ ప్రిన్సిపల్ పి గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈనెల 5వ తేదీ నుంచి వచ్చేనెల 4వ తేదీ వరకు ప్రత్యేక ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 8500021856, 9573860659 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## బంగారు తిరుచ్చి పై శ్రీ పద్మావతి అమ్మవారు

తిరుచానూరు, జనవరి 2 ప్రభాతవార్త:



తిరుచానూరుశ్రీ పద్మావతి అమ్మవారు శుక్రవారం సందర్భంగా బంగారు తిరుచ్చి పై ఆలయ మాడ వీధులలో విహరించి భక్తులకు అభయం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో భక్తులు, ఆలయ సూపరెన్టెంట్ ముని చెంగల్ రాయలు,సురేష్, ప్రసాద్ , విజిలెన్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణి

నింద్ర,జనవరి 2 ప్రభాతవార్త :



రీసర్వే జరిగిన అర్హులైన రైతులకు పట్టాదారు పాసుబుక్ పంపిణి చేసినట్లు నగరి ఆర్‌డిఓ అనుపమ తెలిపారు.శుక్రవారం మండలంలోని పాదిరి రెవిన్యూ గ్రామంలో నగరి ఆర్‌డిఓ అనుపమ చేతుల మీదగా పట్టాదారు పాసుబుక్ పంపిణి చేసారు. ఈకార్యక్రమంలో తహశీల్దారు ఈశ్వర్,ఆర్ఐ ప్రభాకర్,విఆర్‌ఓ జోన,యంపిటిసి రమ్య,సర్పంచ్ సూర్య, నాయకులు రవికుమార్,జయచంద్రనాయుడు తదితరులు పాల్గోన్నారు.

## మినుమల పంటలో క్షేత్ర ప్రదర్శన

నింద్ర,జనవరి 2 ప్రభాతవార్త :



మినుము పంటలో ముఖ్యంగా మనకి బూడిద తెగులు అనేది విత్తిన 30-35 రోజుల తర్వాత గాలికి తేమ ఎక్కువగా ఉన్నప్పుడు ముదురు ఆకులపై బూడిద రూపంలో చిన్నచిన్న మచ్చలుగా కనపడి అవిక్రమేన పెద్దవై ఆకులపైన క్రింది భాగాలకు, కొమ్మలు,కాయలకు వ్యాపిస్తుంది. రబీకాలంలో ఈతెగులు వ్యాప్తి ఎక్కువ ఉంటుంది. దీని నివారణ కొరకు 1గ్రాము టయోఫెనెట్ మిథైల్,నీటిలో కరిగే గంధకము మూడు గ్రాములు, మైకోబుతానిల్ 1 గ్రాము ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకొన్నట్లుయితే ఈతెగులను సమర్ధవంతంగా నివారించుకోవచ్చు. ఈకార్యక్రమంలో యంపిపి రెడ్డివారి భాస్కర్‌రెడ్డి,ఎడిఎ కవిత,మండల వ్యవసాయాధికారి తులసిరామ్, పిఎసియస్ చేర్మన్ వెంకటేశ్వరావు తదితరులు పాల్గోన్నారు.

## భూ రీసర్వే తరువాత పాస్ పుస్తకాలు పంపిణీ

కేవీబీపురం, జనవరి 2 ప్రభాతవార్త:



111 సర్వే జరిగిన ప్రతి ఒక్కరికి పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామని తహసీల్దార్ తనూజ పేర్కొన్నారు. శుక్రవారం మండలకేంద్రమైన కేవీబీపురం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో భూములపై రీ సర్వేతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడు రెవెన్యూ గ్రామాల్లో భూ రీ సర్వే కార్యక్రమం జరుగుతుందని జరగగానే వెంటనే రెవెన్యూ తరపున భూ హక్కుల పత్రాలు పాస్‌పుస్తకాలు ఇవ్వడం జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు. సమావేశంలో ఆర్ఐలు వెంకటయ్య, కరుణాకర్, వీఆర్‌వోలు మునిభాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

## మనిషి ప్రవర్తనలో మార్పు రావాలి! : రేహన్

శ్రీకాళహస్తి,జనవరి 2 ప్రభాతవార్త:



సమాజం నేడు ఫ్యాషన్ మోజుల్లో తల్లడిల్లుతుందని మన సంప్రదాయాలు, సంస్కృతులను మరచి యువత సాగుతుందని మనిషి నడవడిక ప్రవర్తనలో మార్పు రావాలని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ పిలుపు నిచ్చారు. శుక్రవారం జామియా మస్‌జిద్‌లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా ఆయన హదీస్ సందేశాలను వివరిస్తూ మనం మన ఇష్టప్రకారం జీవించటానికి అలవాటు పడుతున్నామన్నారు. ఇది సరైన విధానం కాదని, మనం అల్లాహ్‌కు ఇష్టపడే జీవితాన్ని గడపాలన్నారు. ప్రవక్త ఆచరించిన విధానాలను ఆచరిస్తూ అల్లాహ్‌కు దగ్గర కావాలని రేహాన్ సూచించారు. ప్రవక్త ఆచరించిన కొన్ని విధానాలను మనం తప్పక ఆచరించి సన్మార్గంలో నడవాలని సూచించారు. అందులో మూడు సూత్రాలను పాటిస్తే మనలోని మంచి తనం ఎదుటి వారికి తెలుస్తుందన్నారు. మనలోని సంప్రదాయాన్ని గుర్తించుటకు తెలిసిన వారైనా తెలియని వారై 'సలాం' చేయాలి. నమస్కారం నిదర్శనం అన్నారు. రెండవది మనస్సును నిర్మలంగా ఉంచుకోవాలి. ఎదుటి వారికి సంబంధించిన చెడును తొలిగించుకోవాలి. లేచి నపుడు కూర్చునే సమయంలో అల్లాహ్‌ను తలవాలని సూచించారు.

## భూ సమస్యల పరిష్కార దిశగా అడుగులు..!

తొట్టంబేడు జనవరి 2 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ ఉమ్మడి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ భూముల రీ సర్వేలో, గత ప్రభుత్వంలో అక్రమంగా దోచుకోని భూములు,ఇంటి స్థలలాను అవకతవకలు చేసి దర్జాగా కాలం గడిపిన వారికి చెక్కు పడినట్లు తెలుగుదేశం పార్టీ తొట్టంబేడు మండల అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజనాయుడు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ప్రభుత్వంలో రైతులకు మేలు చేయాలని దృఢసంకల్పంతో దొంగలముదూరు గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సమస్యల పరిష్కరదిశగా ప్రభుత్వ రాజముద్రతో ముద్రించబడిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు శుక్రవారం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మండల మాజీ వ్యవసాయ మార్కెట్‌కమిటి చైర్మెన్ జయచంద్ర నాయుడు, తిరుపతి పార్లమెంట్ కార్యదర్శి ఎం.వెంకటసుబ్బయ్య,చిన్నకన్నపర్తి శంకర్‌నాయుడు,పి.రామకృష్ణనాయుడు,మాజీ ఎంపిటిసి చీకటివేణు, రమేష్, రెవెన్యూ అధికారులు గ్రామ కర్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పరశురామేశ్వరుని సేవలో కన్నడ అధికారి

ఏర్పేడు,జనవరి 2 ప్రభాతవార్త:



గుడిమల్లంలో వెలసిన ఆనందవల్లి సమేత పరశురామేశ్వరాలయంలో శుక్రవారం బెంగుళూరుకుచెందిన రా ఆఫీసర్ మీనాక్షి కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆమె రాగా ఆలయ చైర్మెన్ బత్తల గిరిబాబునాయుడు వారి సహచరులు మేళ తాళాలు మగళవాయిద్యాదలతో వేదపండితులతో స్వాగతం పలికారు. ఆలయ చరిత్రను గురించి వివరించారు. ఆలయంలో చేపడుతున్న అభివృద్ధిని వివరిస్తూ ప్రభుత్వం తరపున కర్నాటక సత్రాలను నిర్మిస్తే భక్తులకు రాత్రి బస చేయటానికి ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు.ఆలయ ప్రాశస్త్యంను వివరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి రామచంద్రారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.దర్శనం తరువాత స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు,వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.

# తిరుపతి డివిజన్

## ఆర్‌టీఐ కమిటీ సత్యవేడు సెక్రటరీగా అంకయ్య

నాగలాపురం, జనవరి 2 ప్రభాతవార్త:



ఆర్టీఐ సమాచార హక్కు చట్టం సాధన కమిటీ సత్యవేడు సెక్రటరీగా తిరుపతి జిల్లా నాగలాపురం మండలం సుబ్బానాయుడు కండ్రిగకు చెందిన డి.అంకయ్యను నియమిస్తూ ఆ కమిటీ జాతీయ అధ్యక్షుడు చంటి ముదిరాజ్ శుక్రవారం నియామక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా చంటి ముదిరాజ్ మాట్లాడుతూ అభివృద్ధిని అన్ని మూలల నుంచి అడ్డుకుంటున్న అవినీతిని అంతమందించేందుకు సమాజంలో ఆర్టీఐ హక్కు పట్ల పూర్తి అవగాహన కల్పించేందుకు ఆర్టీఐ సభ్యులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆర్టీఐలో నూతన కమిటీలు వేస్తున్నట్లు ఆసక్తి ఉన్న వారు జాతీయ కమిటీని సంప్రదించాలని ఆయన కోరారు. అవినీతి, దౌర్జన్యాలను అరికట్టేందుకు ఆర్టీఐ లాంటి వజ్రాయుధంతో ప్రజలకు పూర్తి అవగాహన సదస్సులు చేపట్టి ప్రజలను చైతన్యవంతులను చేస్తామని అన్నారు.

## భక్తులను కనువిందు చేసిన పద్మావతీ అమ్మవారు

నారాయణవనం, జనవరి 2 ప్రభాతవార్త:



నారాయణవనంలోని పద్మావతీదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరుని ఆలయంలో శుక్రవారం భక్తుల సందడి అధికమైంది. ముందు అమ్మవారిని, స్వామివారిని తిరుప్పావై ప్రవచనంతో మేల్కొలిపి సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం 5 గంటల నుంచి గంట పాటు ఊంజల్‌సేవ నిర్వహించారు.

## జిల్లా ఎస్పీ, టిడిపి నేత శంకర్‌రెడ్డిలను కలిసిన జడ్పీటీసీ సుమన్

నారాయణవనం, జనవరి 2 ప్రభాతవార్త :



తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, సత్యవేడు టిడిపి ప్రొగ్రామ్ కో ఆర్డీనేటర్ కూరపాటి శంకర్‌రెడ్డిలను సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తనయుడు, చిత్తూరు ఉమ్మడి జిల్లాల జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్ శుక్రవారం కలిసి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దుశ్శాలువ, పూలమాలలు, పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. వారు కూడా సుమన్‌కుమార్ సత్కరించారు.

## రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ

విజయపురం, జనవరి 2 ప్రభాతవార్త:



విజయపురం మండలంలోని వ్యవసాయ భూములను రీ సర్వే చేసిన తరువాత రాజముద్రతో ముద్రించిన పట్టాదారు పాస్ పుస్తకాలను ఎల్లసముద్రం గ్రామంలో సంబంధిత రైతులకు శుక్రవారం నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టాదారు పాస్ పుస్తకం అంటే భూమిపై రైతుల హక్కును తెలియజేస్తుందని, అయితే రైతుల పట్టా పాస్ పుస్తకాలపై ఇష్టారాజ్యంగా ఫోటోలు వేయించుకున్న ఘనత గత వైసీపీ ప్రభుత్వానికే చెల్లిందని దుయ్యబట్టారు. పట్టాదారు పాస్ పుస్తకాల పైనే కాక భూముల సరిహద్దు రాళ్ళ మీద కూడా జగన్ ఫోటోలు వేయించుకుని రైతుల హక్కులను కాల రాశారన్నారు.కార్యక్రమంలోఎంఎస్ఎంఈ రాష్ట్ర డైరెక్టర్ చినబాబు, నగరి ఆర్డీవో అనుపమ, తహసీల్దార్ కిరణ్, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ, ఏఈఈ గిరీష్ కుమార్, పీఆర్ఏఈ వీరభద్రం, వ్యవసాయ అధికారి రజని కుమారి, టీడీపీ మండల అధ్యక్ష కార్యదర్శులు రమేష్‌రాజు, బాబుయాదవ్, నాయకులు లోకేష్ రాజు, దశరథరాజు, బాబునాయుడు, సుధానాయుడు, మురళి, గుణభూషణమ్మ, దివాకర్, మోతిలాల్, బాబు, గాలి రమేష్, ఆర్ముగంరెడ్డి, కొండూరు దాము, హరికృష్ణ, పలువురు అధికారులు, అనధికారులు, రైతులు పాల్గొన్నారు.

## విగ్రహాన్ని ధ్వంసం చేసిన మాజీ మంత్రిపై చర్యలు తీసుకోవాలి

- పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేసిన బలిజ సంఘం నాయకులు

వరదయ్యపాలెం, జనవరి 2 ప్రభాతవార్త:



సత్యవేడు నియోజకవర్గంలోని వరదయ్యపాలెం మండలం ఆర్పీఎఫ్ సంస్థ అధ్యక్షులు, రెడ్డిశేఖర్ ఆదేశాల మేరకు ఆర్‌పిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పసుపులేటి, విజయ్ కుమార్, ఆర్‌పిఎఫ్ మండల అధ్యక్షులు, పెమినేటి, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కొత్తపేట నియోజకవర్గం రావులపాలెం మండలం నందు శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాన్ని నిర్మించేందుకు పెట్టిన శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాన్ని వైఎస్ఆర్సిపి మాజీ మంత్రి చిర్ల జగ్గారెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసి కాళ్లతో తన్ని కృష్ణదేవరాయలు వంశాన్ని, కాపు బలిజ నాయకుల మనోభావాలు దెబ్బ తినే విధంగా వ్యవహరించేటువంటి చీరల జగ్గారెడ్డి పై కఠిన చర్యలు తీసుకోవాలని వరదయ్యపాలెం పోలీస్ స్టేషన్ ఇంచార్జ్ సాయిబాబాకి ఫిర్యాదు చేసారు. ఈ కార్యక్రమంలో కే.దిలీప్ రాయల్, మోహన్ రాయల్, లోకనాథ్, రమేష్, కుమార్, శేఖర్, మణికంఠ, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల ప్లస్‌లో బాలుర మరుగుదొడ్లు ప్రారంభం



**వరదయ్యపాలెం, జనవరి 2 ప్రభాతవార్త:** వరదయ్యపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాండూరుకు చెందిన పరంధామరెడ్డి కుమారుడు శ్రీనివాసులురెడ్డి సుమారు 7లక్షల విలువగల మరుగుదొడ్డిని నిర్మించారు. ఈ మరుగుదొడ్లు వరదయ్యపాలెం మండల తహసిల్దార్ ఈ సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. దీనిని వరదయ్యపాలెం మండల తహసిల్దారు ప్రధానోపాధ్యాయులు జి.రమణయ్య, ధాత శ్రీనివాసులురెడ్డి ప్రారంభించారు. ఇంత కాలంగా బాలుర మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పిల్లలు టాయిలెట్లను సద్వినియోగం చేసుకోవాలని అంతేకాక జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని తెలియజేశారు. అనంతరం దాత శ్రీనివాస్ రెడ్డిని, వరదయ్యపాలెం తాసిల్దార్ సుధీర్ రెడ్డిని, దృశ్యాలువతో సన్మానించారు.

## డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరణ

వరదయ్యపాలెం, జనవరి 2 ప్రభాతవార్త:



రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) వరదయ్యపాలెం మండల శాఖ ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను మండల విద్యాశాఖ అధికారులు సరస్వతి, గున్నయ్య లచే స్థానిక ఎమ్మార్సీ ఆవరణలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పూడి శ్రీనివాస్ యాదవ్, పామంజి సూరిబాబు జిల్లా నాయకులు వెంపల్ల చిన్నయ్య, చెంగయ్య, శ్యాంసుందర్, ముజీబ్, గోకుల కృష్ణ, సుబ్బరామయ్య, శివ, రవిబాబు, మోహన్‌రావు, శ్రీనివాసరావు, అప్పారావు, సుగుణ, సురేఖ, వెంకట నాయుడు నాగరాజు, దుర్గారావు, ద్రాక్షాయని తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



వరదయ్యపాలెం, జనవరి 2 ప్రభాతవార్త:

నూతన సంవత్సరం సందర్భంగా బిఈపిసి, సేవ స్కై ఫౌండేషన్ సంయుక్తంగా వరదయ్యపాలెం మండలం వరదయ్యపాలెం పంచాయతీ గోపాల్ రావు గిరిజన కాలనీలోని 25 మంది వృద్ధులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక తహసిల్దార్ సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున వృద్ధుల కోసం ఇటువంటి సేవా కార్యక్రమాలు చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు రియాజ్‌ు ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి, విఆర్ఓ కిరణ్, బిఈపిసి సభ్యులు అబ్దుల్లా, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ముక్కోటి ధర్మకర్త మిగిలి రఘురామిరెడ్డి కన్నుమూత

చంద్రగిరి, జనవరి 2 ప్రభాతవార్త:



తొండవాడ స్వర్ణముఖీనదీ తీరాన కొలువుదీరిన శ్రీ అగస్త్యేశ్వర స్వామి వారి ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి (74) గురువారం వేకువజామున కన్నుమూశారు. వంశపారపర్య ఆలయ ధర్మకర్తగా స్వామి వారికి విశిష్ట సేవలందించి, ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేసిన ఆయన మరణం గ్రామస్తులు, భక్తులు జీర్ణించుకో లేకపోతున్నారు. ఈ నేపథ్యంలో పలువురు ప్రముఖులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల అశ్రునయనాల నడుమ శుక్రవారం ఉదయం స్వర్ణముఖీనది శ్మశానవాటికలో దహనక్రియలు నిర్వహించారు.

## ప్రభుత్వ ముద్రతో రైతులకు పాసు పుస్తకాలు పంపిణీ



దక్కిలి, జనవరి2 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా గతంలో జరిగిన రీసర్వే గ్రామాల్లో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు దక్కిలి తాహశీల్దారు మోపూరు.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని లింగసముద్రం గ్రామ సచివాలయంలో శుక్రవారం రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఉమ్మడి కూటమి ప్రజాప్రతినిధులతో కలసి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వే జరిగిన గ్రామాల్లో రెవిన్యూ సదస్సులు నిర్వహించి పాసుపుస్తకాలు ఇస్తున్నట్లు వివరించారు. మాజీ జెట్పీటీసీ సభ్యుడు, మాదావాయపాళెం సొసైటీ అధ్యక్షుడు ఏల్వేరం రామచంద్రయ్య నాయుడు మాట్లాడుతూ రీసర్వేలో రైతులకు సంబందించిన భూములును రెవిన్యూ సిబ్బంది పక్కాగా సర్వే చేసి రికార్డులను సరి చేయాలని తెలిపారు. దక్కిలి మండల టీడీపీ అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం పంపిణీ చేస్తున్న పాసుపుస్తకాలు ద్వారా రైతులకు సంబంధించి రికార్డులు పక్కాగా ఉన్నాయని, వీటి ద్వారా బ్యాంకుల నుంచి పంట రుణాలు, వివధ ప్రభుత్వ పథకాలు పొందడంతో పాటు రైతులకు భరోసా కల్పిస్తాయని తెలియజేశారు.

## సూళ్లూరుపేటలో ఇస్కాన్ పాదయాత్ర



సూళ్లూరుపేట, జనవరి 2 ప్రభాతవార్త: ఇస్కాన్ ఆలిండియా పాదయాత్రలో భాగంగా శుక్రవారం పాదయాత్ర బృందం సూళ్లూరుపేటకు చేరుకుంది. కృష్ణుని జన్మస్థలమైన ద్వారక నుంచి ప్రారంభమైన పాదయాత్ర భగవద్గీత మహాసందేశాన్ని, సనాతన ధర్మ విలువలను దేశ ప్రజలకు తెలియజేస్తూ ఆధ్యాత్మికంగా చైతన్యపరిచే కార్యక్రమంలో భాగంగా ఇస్కాన్ పాదయాత్ర భారతదేశమంతా కొనసాగుతుంది. చెన్నై వైపు వెళుతున్న పాదయాత్ర బృందానికి నెల్లూరు ఇస్కాన్ సంస్థ వారి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. సూళ్లూరుపేటకు వచ్చిన ఈ పాదయాత్ర బృందానికి సూళ్లూరుపేట ఇన్‌ఛార్జ్ వెంకటరమణదాస్, శ్రీనివాసులు, ఎంవి రమణయ్య, బద్రి బలరామ్, ప్రభు ప్రహ్లాదద దాస్, ఉత్తమ నరహరిలు స్వాగతం పలికి పాదయాత్రలో పాల్గొన్నారు.

## కుంచె పడితే కళాఖండమే

సూళ్లూరుపేట, జనవరి 2 ప్రభాతవార్త: చిత్రలేఖనంపై మక్కువతో చిన్నతనం నుంచి చిన్నచిన్న చిత్రాలను గీస్తూ మంచి పేరు తెచ్చుకున్న బెజవాడ దివ్యశ్రీ ప్రస్తుతం అద్భుత కళాఖండాలను గీస్తూ పలువురి ప్రశంసలు పొందుతోంది. సామాన్య కుటుంబం, సూళ్లూరుపేటలోని పరసారత్నం కాలనీకి చెందిన బెజవాడ దివ్యశ్రీ. శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరిదేవిపై ఉన్న భక్తిభావంతో అమ్మణ్ణి మహత్యాన్ని చాటే చెంగాళమ్మ చెట్టును తన చిత్రలేఖనం ద్వారా అద్భుతంగా చిత్రీకరించింది. ఈ చిత్రలేఖన నమూనాను చెంగాళమ్మ దేవస్థానం సహాయ కమిషనర్ బివి ప్రసన్నలక్ష్మికి అందజేశారు. ప్రభుత్వం నుంచి తనకు ప్రోత్సాహం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## నేడు విద్యుత్ కోత

సూళ్లూరుపేట, జనవరి 2 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమ్మ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ కోత అమల్లో ఉంటుందని ఎడిఇ ఆర్.శేఖర్ శుక్రవారం తెలిపారు. ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహణ నేపథ్యంలో మెరుగైన విద్యుత్ సరఫరా కోసం చెంగాళమ్మ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్నామని తెలిపారు.

## పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ



దొరవారిసత్రం, జనవరి 2 ప్రభాతవార్త: మండల పరిధిలో గతంలో చేపట్టిన సర్వే లో భాగంగా మావిళ్ళపాడు, లింగంపాడు గ్రామాల్లో మండల తాసిల్దార్ శైలు కుమారి ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమం ఈ నెల 9వ తేదీ దాకా కొనసాగుతుందని సర్వే జరిగిన అన్ని సచివాలయ పరిధిలో రైతులకు కొత్త పట్టా పాస్ పుస్తకం పంపిణీ జరుగుతుందని మండల తహసిల్దార్ శైలు కుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో జ్ఞానేంధర్, స్థానికనాయకులు, రైతులు పాల్గొన్నారు.

## పుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మార్వో



పెళ్లకూరు, జనవరి 2 ప్రభాతవార్త: గత ప్రభుత్వ హయాంలో భూముల సర్వేలో జరిగిన లోటుపాట్లను సరిదిద్దడం కోసం కొత్తగా రీసర్వే కార్యక్రమాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. ఈ పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమం శుక్రవారం జీలపాటూరు గ్రామంలో నిర్వహించారు. ఈ పంపిణీ కార్యక్రమంలో తహసిల్దార్ సిహెచ్ హరికృష్ణతో పాటు రెవెన్యూ అధికారులు మరియు తెదేపా మండల అధ్యక్షులు సంచి కృష్ణయ్య, జీలపాటూరు సర్పంచ్ కె.శివకుమార్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ఎద్దల నరేందర్‌రెడ్డి, స్వర్ణముఖి నది మాజీ ఆయకట్టు చైర్మన్ పేరం రమేష్ నాయుడు, కె.పలనీ, సిద్ధులు నాయుడు, నాగేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్ సద్వినియోగం చేసుకోండి : ఎమ్మెల్యే



నాయుడుపేట మున్సిపల్ కార్యాలయంలో ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించి, పాలనను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రజా దర్బార్ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సూళ్ళూరుపేట శాసనసభ్యురాలు నెలవల విజయశ్రీ కార్యక్రమంలో పాల్గొని, స్వయంగా ప్రజల నుండి వినతులను స్వయంగా స్వీకరించారు. ప్రజా దర్బార్‌కు నియోజకవర్గం లోని మునిసిపాలిటీ పరిధిలో ఉన్న ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, నాయుడుపేట తహశీల్దార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిడిగల్లు మాజీ సొసైటీ అధ్యక్షులు రంగనాథం మృతి

బాలాయపల్లి, జనవరి 2 ప్రభాతవార్త: మండలంలోని నిడిగల్లు మాజీ సొసైటీ అధ్యక్షులు కాసారం రంగనాథం రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. రంగన్నాథ మోటర్ బైక్‌లో వెళుతుండగా ప్రమాదవశాత్తు ముద్దంపల్లి గ్రామం వద్ద రెండు రోజుల క్రితం కిందపడి గాయపడడంతో తిరుపతికి చికిత్స నిమిత్తం బంధువులు తరలించారు. ఆయన తిరుపతిలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. స్వగ్రామమైన గాజులపల్లి గ్రామంలో శనివారం అంత్యక్రియలు జరుగుతాయని బంధువులు తెలిపారు.

## విశాఖపట్నంలో 4 తేదీ సిఐటియు బహిరంగ సభ

వెంకటగిరి, జనవరి 2 ప్రభాతవార్త: విశాఖపట్నంలో ఈ నెల నాలుగో తేదీ జరగబోవు బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు రెడ్డిపల్లి చంగయ్య తెలిపారు. సిఐటియు ఆధ్వర్యంలో వెంకటగిరి పట్టణంలోని పురవీధులలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఐటియు 18వ ఆల్ ఇండియా మహాసభలు డిసెంబరు 31వ తేదీ నుండి జనవరి 4వ తేదీ వరకు జరుగుతున్నాయని అన్నారు. ఈ మహాసభల సందర్భంగా ఈనెల నాలుగవ తేదీ సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన భారీ బహిరంగ సభ జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సుబ్బయ్య ప్రసాద్ పెంచలయ్య రమణయ్య బాలయ్య నారాయణ దొరబాబు, ఇందిరమ్మ తదితరులు పాల్గొనడం జరిగింది.

## అక్రమాలకు పాల్పడితే చర్యలు : పిడి



వెంకటగిరి, జనవరి 2 ప్రభాతవార్త: ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. మండలంలోని యాతలూరు పంచాయతీలో జరుగుతున్న ఫిష్ పాండ్ పనిని తనిఖీ తనిఖీ చేశారు. నిబంధనల ప్రకారం పనులు చేయాలని తెలిపారు. అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పనులు నాణ్యతగా చేయాలని, ఉపాధిలో ఆస్తుల కల్పన సృష్టించి పంచాయతీకి ఉపయోగ పడేలా చూడాలని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ రిజిస్టర్లను కూడా తనిఖీ చేశారు. పీడీ వెంట కోర్స్ డైరెక్టర్ చంద్ర శేఖర్ రాజు, ఏపీఓ క్రిష్ణయ్య, ఈసీ ముని శేఖర్, టెక్నికల్ అసిస్టెంట్ బుజ్జయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ ముని పాల్గొన్నారు.

## రాజముద్రలతో పట్టాదారు పాసు పుస్తకాలు



బాలాయపల్లి, జనవరి 2 ప్రభాతవార్త: రాజముద్రలతో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ప్రభుత్వం పంపిణీ చేస్తున్నట్లు సొసైటీ అధ్యక్షులు రాయి మస్తాన్ నాయుడు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి రీ సర్వేలో భాగంగా యూత జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ఫోటో వేసి రైతులకు పాస్ పుస్తకాలు ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ విజయలక్ష్మి, మండల టిడిపి అధ్యక్షుడు రాయి సత్యం నాయుడు, ఆర్ఐ శ్రీకాంత్, విఆర్ఓ పెంచలయ్యలు పాల్గొన్నారు.

## రీ సర్వేలో పాస్ పుస్తకాలు పంపిణీ



వాకాడు, జనవరి 2 ప్రభాతవార్త: వాకాడు మండలం ఇసుకనట్టు రెవెన్యూ గ్రామంలో తహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్ ఆధ్వర్యంలో మండల టిడిపి కన్వీనర్ దువ్వూరు మధుసూదన్ రెడ్డి చేతుల మీదుగా 89 మంది రైతులకు ప్రభుత్వం రాజముద్రతో పాస్ పుస్తకాలు పంపిణీ జరిగింది. శుక్రవారం జువ్వినట్టు పంచాయతీ గ్రామ సభలో మండల టిడిపి కన్వీనర్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ రీ సర్వే కార్యక్రమం ద్వారా రాజముద్రతో పాసు బుక్కులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిద్దారెడ్డి మధుసూదన్ రెడ్డి, మాజీ సర్పంచ్, టిడిపి నాయకుడు ద్వారకనాథ్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు శ్రీనివాసులు రెడ్డి, రెవెన్యూ విఆర్ఓ హరిబాబు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అడ్డూ అదుపూలేని ఇసుక ట్రాక్టర్లు

**వాహన, పాదాచారుల ప్రాణాలకు ముప్పు**



తొట్టంబేడు, జనవరి 2 ప్రభాతవార్త: మండలంలోని స్వర్ణముఖి పరీవాహక ప్రాంతంలో మట్టి, ఇసుక ట్రాక్టర్లు జోరు శృతి మించుతుంది. రాత్రి పగలనక ఈ ట్రాక్టర్ల సంచారం భయభ్రాంతుల్ని చేస్తుంది. ఇటీవల మండలంలోని చియ్యవరం మార్గంలో ఇసుక ట్రాక్టర్ ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. బుధవారం రాత్రి మండలంలోని పెద్ద కనపర్తి కొంతనేరి మధ్య జరిగిన ఓ ప్రమాదం పలువురిని కలచి వేసింది. దిగువ కొంతనేరికి చెందిన కోవిశేఖర్, ఎండేపల్లి జగదీష్‌లు గ్రామం నుంచి శ్రీకాళహస్తికి పనుల నిమిత్తం వెళుతుండగా శ్రీకాళహస్తి నుంచి కనపర్తి వైపుకు ఇసుక కోసం వెళుతున్న ట్రాక్టర్ అదుపుతప్పి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ట్రాక్టర్ నడుపుతున్న డ్రైవర్ వాహనాన్ని నడిపే సమయంలో పాటించాల్సిన నిబంధనలనుపాటించక మద్యం సేవించి ఉన్నట్లు ఆరోపణలున్నాయి. ట్రాక్టర్ ఢీ కొనటంతో ఇద్దరు మోటార్‌సైకిలిస్టులు పక్కనే ఉన్న మల్లెల తోటలో పడినట్లు కేసు దర్యాప్తు చేస్తున్న సిఐ తిమ్మయ్య శుక్రవారం తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం ఇవ్వగా వారు బాధితుల్ని శ్రీకాళహస్తిలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అసలే శ్రీకాళహస్తి-కనపర్తి రోడ్డు సింగిల్ రోడ్డు అందులో నిత్యం స్వర్ణముఖి నది నుంచి ఇసుక కోసం ట్రాక్టర్ల సంచారంతో రోడ్డు ధ్వంసం అయ్యింది. ఈ మార్గంలో ప్రయాణం దిన దిన గండంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ఈ మార్గంలో శేషమనాయుడు కండ్రిగ, పూడి, ఇలగనూరు, గుర్రప్పనాయుడు కండ్రిగ, దిగువ కొంతనేరి, కొన్నలి, పిల్లమేడు, కాసరం, వెంకటగిరి రోడ్డు వరకు లింక్ ఉంది. ఈరోడ్డు దుస్థితిని గుర్తించి శాసనసభ్యుడు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మండల మాజీ అధ్యక్షుడు గాలి మురళి నాయుడు పరామర్శించారు. వారికి సిఎం సహాయనిధి నుంచి ఎంఎల్ఏ ద్వారా సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు.

## స్విమ్స్ మైక్రోబయాలజీ విభాగంకు పిఎం

**-ఏబిహెచ్ఐఎం పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వ నిధుల మంజూరు**



తిరుపతి హెల్త్, జనవరి 2 ప్రభాతవార్త: శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మిషన్ పథకం క్రింద మైక్రోబయాలజీ విభాగం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ద్వారా ఐఆర్‌డిఎల్ ల్యాబ్ నిమిత్తం నిధులు మంజూరు చేయడం జరిగిందని మెడికల్ సూపరిటెండెంట్ డా. రామ్ తెలియచేశారు. మైక్రోబయాలజీ విభాగాధిపతి డా. వెంకటరమణ మాట్లాడుతూ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ఆరోగ్య పరిశోధన విభాగం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం ద్వారా స్విమ్స్ మైక్రోబయాలజీ విభాగానికి పరిశోధన పథకానికి ప్రథమ సంవత్సర కాలపు గ్రాంట్ రూ. 8,55,622,170 బడ్జెట్‌ను కౌన్సిల్ డైరెక్టర్ జనరల్ ద్వారా నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డా. ఆర్.వి.కుమార్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా కేటాయించిన నిధులు అంటు వ్యాధి నిర్ధారణ, పరిశోధన కోసం, ఐడిఆర్ఎల్ ల్యాబ్ మరింత బలోపేతం చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. దక్షిణ భారతదేశంలోనే పిఎం-ఏబిహెచ్ఐఎం పథకం ద్వారా స్విమ్స్, తిరుపతి మరియు బి.ఎం.సి. బెంగళూరు వారికి నిధులు కేటాయించడం సంతోషదాయకమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మైక్రోబయాలజీ వైద్యులు ప్రొఫెసర్ డా.జయప్రద, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘంటసాల విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు



తిరుపతి, జనవరి 2 ప్రభాతవార్త: నూతన ఆంగ్లసంవత్సరం నెలమొదటిన తిరుపతిలోని ఘంటసాల విగ్రహానికి రాయలసీమ రంగస్థలి కళాకారులు పాలాభిషేకం చేసి, విశేష పుష్పాంజలి ఘటించారు. అమరగాయకుడు, తెలుగువారి మదిలో చిరస్థాయిగా నిలిచిన ఘంటసాల ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయుడని రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి కొనియాడారు. తెలుగుప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గాయకుడని అన్నారు. భవానీనగర్ కూడలిలో ఉన్న ఘంటసాల విగ్రహానికి రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, కళాకారులు కెఎన్ రాజా, అక్కిపల్లి మునికృష్ణయ్య యాదవ్, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, కరుణాకర్, సింగంశెట్టి సుబ్బరామయ్య, కొట్టే సుబ్రమణ్యం, పొన్నాల జేజిరెడ్డి, రామకృష్ణ, ఆంజనేయులు, చంద్రశేఖర్, కస్పాపద్మనాభం, ఉపాధ్యాయుడు తిరుమలయ్య, ఆదిస్వామి తదితరులు పుష్పాంజలి ఘటించారు. ఘంటసాల అభిమానులను సన్మానించారు.

## వైసిపి నుంచి 4గురు ఎంపిటిసిలు సస్పెండ్

పుత్తూరు, జనవరి 2 ప్రభాతవార్త : నగరి నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నలుగురు ఎంపిటిసిలను ఆ పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఇటీవల జరిగిన ఎంపిపి ఎన్నికల్లో వీరు పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించడంతో వీరిని సస్పెండ్ చేస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడినట్టు ఆ పార్టీకి చెందిన మాజీ మంత్రి ఆర్.కె.రోజా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో వడమాలపేట ఎంపిపిగా వున్న విజయలక్ష్మి, నింద్ర మండలానికి చెందిన అత్తూరు ఎంపిటిసి నాగినేని దుర్గాదేవి, ఆరూరు ఎంపిటిసి ఎం.రమ్య, విజయపురం మండలం బూచివానత్తం ఎంపిటిసి డి.రాజగోపాల్ కొన్ని రోజుల క్రితం జరిగిన ఎంపిపి ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించి తెలుగుదేశం పార్టీకి మద్దతు పలికారు. అలాగే వడమాలపేట మండలంలో ఎంపిపిని మార్చే ప్రక్రియలో ఎంపిపిగా రాజీనామా చేయాలనే మాజీ మంత్రి ఆదేశాలను పట్టించుకోకుండా ఎంపిపి విజయలక్ష్మి పరోక్షంగా టిడిపి మద్దతుతో ఎంపిపిగా కొనసాగుతున్నారు.

## లార్వా నిర్మూలన కోసం మలాథియాన్ స్ప్రే



సత్యవేడు, జనవరి 2 ప్రభాతవార్త: సత్యవేడు మండలం పుదుకుప్పం గ్రామంలో లార్వా నిర్మూలన కోసం పలు చోట్ల మలాథిన్ క్రిమిసంహారక మందును స్ప్రే చేశారు. స్థానిక ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ శరవణ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ నాగమణి దేవేందర్‌రెడ్డి అధ్యక్షతన దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి క్రిస్టల్‌దాస్ పరిరక్షణలో మురుగునీరు నిల్వ ఉన్న చోట, అపరిశుభ్రంగా ఉన్న పలు చోట్ల మలాథిన్ తిరిగి సంహారక మందును స్ప్రే చేయించడం జరిగింది. కార్యక్రమంలో దాసుకుప్పం పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈవో సుబ్రహ్మణ్యం, ఏఎన్ఎం దీప, ఎంఎల్‌హెచ్‌పీ మహాలక్ష్మి పాల్గొన్నారు.




మాస పౌర్ణమి సందర్భంగా శుక్రవారం సాయంత్రి రామాలవారి దక్షిణమాట వీధిలోని చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో రమా సహిత సత్యనారాయణ వ్రతం జరిగినది. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభాతవార్త - తిరుపతి

# గూడూరు డివిజన్

## తహసిల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన ఆర్డీవో



వాకాడు, జనవరి 2 ప్రభాతవార్త: మండల కేంద్రమైన వాకాడులోని తహసిల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం సూళ్లూరుపేట ఆర్డిఓ కిరణ్మయి ఆకస్మికంగా పరిశీలించారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. తహసిల్దార్ కార్యాలయాన్ని రికార్డు గది, కార్యాలయం భవనాలును క్షుణ్ణంగా పరిశీలించారు, రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్విభజనలో భాగంగా వాకాడు మండలం సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్ కలవడం సందర్భంగా మొదటిసారి ఆమె రావడం జరిగింది, గతంలో వాకాడు మండలంకు గూడూరు రెవిన్యూ డివిజన్‌గా ఉంది. ఆమె వెంట తహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్, డిప్యూటీ తహసిల్దార్ మహమ్మద్ రఫీ, రెవిన్యూ ఇన్స్పెక్టర్ అఖిల్ యాదవ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## కార్యకర్తలే పార్టీకి మూలస్తంభాలు : ఎమ్మెల్యే



నాయుడుపేట, జనవరి 2 ప్రభాతవార్త: కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి మూలస్తంభాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. శుక్రవారం నాయుడుపేట పట్టణంలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో జరిగిన పరిపాలన కార్యకర్తల అభినందన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమానికి, వారి గుర్తింపునకు పెద్దపీట వేస్తుందని తెలిపారు. తెలుగుదేశం పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు వెన్నంటి ఉండి, ప్రజా సమస్యల పరిష్కారంలో నిరంతరం కృషి చేస్తున్న ప్రతి కార్యకర్త అభినందనీయుడని అన్నారు. సుపరిపాలన అందించడంలో కార్యకర్తల పాత్ర అత్యంత కీలకం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, తెలుగుదేశం పార్టీ నాయకులు కట్టా వెంకట రమణారెడ్డి, పసల గంగా ప్రసాద్, నానబాల సుబ్బారావు, మైలారి రాజశేఖర్, జివిఆర్ నాయుడు, అవధానం సుధీర్, పలుకూరు ముత్యాలయ్య, జువ్వలపాటి మస్తాన్, నిత్యా కృష్ణారెడ్డి, కాపులూరు చక్రపాణి, బల్లి ముత్యాలయ్య, ఆబోతుల బాబు, చేవూరు చెంగయ్య, చెందేటి సుజాత, తుపాకుల కన్నమ్మ, సంపూర్ణమ్మ, లక్ష్మి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## భూ హక్కుల పాస్ పుస్తకాలు పంపిణీ : శంకర్‌రెడ్డి



సత్యవేడు, జనవరి 2 ప్రభాతవార్త: భూ హక్కుల ప్రక్రియలో పారదర్శకతను తీసుకు రావాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం క్యూఆర్ కోడ్‌తో కొత్తగా ఈ పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు తిరుపతి జిల్లా సత్యవేడు టీడీపీ నియోజకవర్గ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోనిఇ మదనంజేరి గ్రామంలో స్థానిక తహసీల్దార్ రాజశేఖర్ ఆధ్వర్యంలో పలువురు లబ్ధిదారులకు ఈ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి, జడ్పీటీసీ విజయలక్ష్మిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా శంకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు కొత్తగా ఇస్తున్న ఈ పాస్ పుస్తకాల రూపకల్పనలో భద్రత, కచ్చితత్వానికి పెద్దపీట వేశారన్నారు. రాజకీయాలకు అతీతంగా రాజముద్రతో ప్రభుత్వం పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. అంతకు ముందు శంకర్‌రెడ్డి మదనంజేరి గ్రామంలో స్థానిక టీడీపీ నాయకులు, అధికారులు శాలువ కప్పి పూలమాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎస్ఐ సాయినాథ్ చౌదరి, టీడీపీ నాయకులు పరమశివం, వీఆర్ కండ్రిగ మోహన్, మురళి, లోకయ్యరెడ్డి, సునీల్‌జైన్, ప్రభాకర్‌రెడ్డి, డిల్లీబాబు యాదవ్, సర్పంచ్ గోవిందస్వామి, శ్యాంప్రసాద్, శివయ్య, తులసి వెంకటేశులు, షణ్ముగం, దయ, దిలీప్, డేవిడ్, జనసేన మండల నాయకుడు బాల మురళీకృష్ణ, సురుటుపల్లి ట్రస్టు బోర్డు సభ్యులు కృష్ణయ్య యాదవ్, శ్రీనివాసులు నాయుడు, నెల్సన్, మండేలా, కేవీబీ మునస్వామి యాదవ్, రీ సర్వే డీటీ త్యాగరాజులు, వీఆర్వో కలయవన్నన్, మండల పరిషత్ పరిపాలన అధికారి త్రివిక్రమరావు పలువురు లబ్ధిదారులు పాల్గొన్నా

## గ్రామాల్లో సమస్యల పరిష్కారంకు చర్యలు : కడ పి.డి



కుప్పం, జనవరి 2 ప్రభాతవార్త: సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో గ్రామీణ ప్రాంతాల్లో సమస్యల పరిష్కారంకు తగు చర్యలు తీసుకుంటామని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చెక్కునత్తంలో జరిగిన గ్రామసభలో పాల్గొన్నారు. అనంతరం పంచాయతీ లోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా గ్రామాల్లో మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తరపున చేపట్టాల్సిన కార్యక్రమాలు రూపొందించాలని స్థానిక నేతలకు సూచించారు. దళితవాడలను సందర్శించి ప్రజలతో మాట్లాడారు. స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలల భవనాలు ఒకటిరెండు చోట్ల పైన సీలింగ ఉండడాన్ని గమనించి మరమ్మతులకు చర్యలు చేపడ్తామన్నారు. కార్యక్రమంలో పికెఎం ఉడా ఛైర్మన్ బిఆర్ సురేష్‌బాబు, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, టిడిపి మండలఅధ్యక్షుడు రాజగోపాల్, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, కార్పోరేషన్ డైరెక్టర్ చెక్కునత్తం మణి, మాజీ ఎంపిపి వెంకటేష్, నేతలు కన్నన్, సత్యేంద్రశేఖర్, తెలుగుయువత అధ్యక్షుడు కనకరాజు, బాబు, కదిరప్ప పాల్గొన్నారు.

## పక్కాగా వైద్య సేవలు

**- విధి నిర్వహణలో ఆలసత్వం వహిస్తే ఉపేక్షించే ప్రసక్తే వుండదు**

**- గుడిపాల పిహెచ్‌సి తనిఖీలో కలెక్టర్ సుమిత్‌కుమార్**



గుడిపాల, జనవరి 2 ప్రభాతవార్త: వైద్యం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చిన రోగులకు పక్కాగా వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ వైద్యాధికారి, వైద్య సిబ్బందిని ఆదేశించారు. గుడిపాల పిహెచ్‌సిని కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంజీవని కార్యక్రమంపై ఓపి, కంప్యూటరైజ్డ్ డేటాను పరిశీలించారు. అలాగే రోగులకు ఇస్తున్న మందుల వివరాలను కలెక్టర్ పరిశీలించారు. లాగిన్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని ఆదేశించారు. పిహెచ్‌సికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. విధుల నిర్వహణలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే ఎట్టి పరిస్థితుల్లోను ఉపేక్షించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి డాక్టర్ చంద్రశేఖర్, సిహెచ్ఓ సూర్యనారాయణ, విజయ్, వెంకటేష్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో నెలకొన్న సమస్యలపై... ఎమ్మెల్యేకు ఎన్ఎంయుఏ వినతి



తిరుపతి హెల్త్, జనవరి 2 ప్రభాతవార్త: జిల్లాలో నెలకొన్న సమస్యలపై దశలవారి పోరాటంలో భాగంగా 5వ దశగా శుక్రవారం ఎన్ఎంయుఏ జిల్లా అధ్యక్షులు డివిఆర్ కుమార్, జిల్లా సెక్రెటరీ బిఎస్ బాబు ఆధ్వర్యంలో తిరుపతి నియోజకవర్గ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుని కలిసి జిల్లా సమస్యలపై మెమోరాండం అందజేసారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి డిపిటిఓతో ఫోన్లో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి తాళ్ల మోహన్, తిరుమల డిపో సెక్రటరీ ఎస్ఆర్ బాబు, ట్రెజరర్ హరికృష్ణ, తిరుపతి డిపో అధ్యక్షులు రమణయ్య, సెక్రటరీ దాము, మంగళం డిపో అధ్యక్షులు ఆర్ఎం రెడ్డి, తిరుమల గ్యారేజ్ సెక్రెటరీ శ్రీనివాసులు, మంగళం డిపో గ్యారేజ్ సెక్రెటరీ శరవణ, అలిపిరి డిపో గ్యారేజ్ సెక్రెటరీ శివకుమార్, తదితర ఉద్యోగస్తులు భారీగా పాల్గొన్నారు.